సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 30-5-2025 15/-



# హజ్ 2025






గీటురాయి
వారపత్రిక

**GEETURAI WEEKLY**

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి: 47 సంచిక: 21 హైదరాబాద్
శుక్రవారం 30 మే 2025 రూ.15-00
2 జిల్‌హజ్జ 1446 హిజ్రీ


**తొలిగీటు**

## సదాచరణను మీ శక్తిమేరకు పాటించండి.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**


**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**


Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. e-mail: geeturaiweekly@gmail.com


## లోపల...


| | |
|---|---|
| ద్వంద్వ ప్రమాణాలు ...... | 04 |
| హజ్ 2025 ...... | 05 |
| ఆర్థిక న్యాయం ఎలా సాధ్యం? ...... | 14 |
| అనుభవాలే ఉపాధ్యాయులు (కథ) ...... | 16 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్ఆన్ అనువాదం) ...... | 18 |
| అడుగుజాడలు ...... | 19 |
| పేదరికం తగ్గితే 80 కోట్ల మందికి రేషన్ ఎందుకు? ...... | 20 |
| ఔలియా అల్లాహ్ ఎవరు? ...... | 22 |
| మంచి లక్షణాలు మనిషికి రక్షణ కవచాలు ...... | 25 |
| ఆరోగ్యానికి పొగపెట్టొద్దు ...... | 26 |
| ధర్మబద్ధ సంపాదన ...... | 29 |
| స్వీయ సంస్కరణకు కొన్ని సూత్రాలు ...... | 30 |
| సంక్షిప్త భారతం ...... | 32 |
| సర్వత్రా ...... | 33 |
| సలామ్ చేసేవారు అల్లాహ్ దృష్టిలో శ్రేష్ఠులు ...... | 34 |


### చర్చలే పరిష్కారం




నెత్తురోడుతున్నదట
అబూజ్ మడ్ అడవి
ఇంకా ముగియలేదట
ఈ ఎన్కౌంటరు నిడివి!
సాగదీయకండి యిక
ఈ మానవ సంహారం
చర్చలు జరుపడమే
సమస్యకు పరిష్కారం!!

– యం.డి. ఉస్మాన్ ఖాన్

## ఆలోచన

# ద్వంద్వ ప్రమాణాలు

**అశోక యూనివర్శిటీ** రాజనీతిశాస్త్ర విభాగం అధిపతి ప్రొఫెసర్ ఎం.ఏ.ఏ.ఖాన్ సోషల్ మీడియాలో ఒక పోస్టు చేశారు. ఆ పోస్టు వల్ల భారతదేశ సార్వభౌమాధికారం, సమగ్రతలకు ప్రమాదం తలెత్తిందని ఆయన్ను అరెస్టు చేశారు. ప్రొఫెసర్ ఖాన్ పోస్టులో భారత సైన్యాన్ని ప్రశంసించాడు. పాకిస్తాన్ దుష్కృత్యాలను నిరసించాడు. పాకిస్తాన్ సైన్యానికి, టెర్రరిస్టులకు మధ్య తేడా లేదన్నట్లు అర్థమవుతుందన్నాడు. దాంతో పాటు కల్నల్ సోఫియా ఖురైషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌ల ప్రెస్ కాన్ఫరెన్సులను మెచ్చుకున్నాడు. అయితే దేశంలో విద్వేష రాజకీయాల గురించి కూడా ప్రశ్నించాడు. హర్యానా రాష్ట్ర మహిళా కమిషన్ ఈ పోస్టుపై ఫిర్యాదు చేసింది. సాయుధ దళాల్లోని మహిళలపై ఆయన చేసిన వ్యాఖ్యలు అనుచితమైనవని, దేశంలో మత విద్వేషకర మైన వ్యాఖ్యలని మహిళా కమీషన్ చీఫ్ రేణూ భాటియా చేసిన ఫిర్యాదు మేరకు వెంటనే పోలీసులు దేశద్రోహం లాంటి తీవ్రమైన సెక్షన్లతో ఆయన్ని అరెస్టు చేశారు. ప్రొఫెసర్ ఖాన్ పోస్టులో రేణు భాటియా చెబుతున్న అర్థాలు ఎక్కడున్నాయో వెదకడం చాలా కష్టంగా ఉందని పలువురు ప్రముఖుల అభిప్రాయాలు కూడా వచ్చాయి.

మరోవైపు మధ్యప్రదేశ్‌లో బీజేపీ నాయకుడు, మంత్రి విజయ్ షా చేసిన వ్యాఖ్యలేమిటి? అత్యంత హీనమైన వ్యాఖ్యలు. కల్నల్ ఖురైషీని టెర్రరిస్టుల సోదరిగా చెప్పాడు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ నేతలెవ్వరూ ప్రతిస్పందించలేదు. హర్యానా మహిళా కమిషన్ చీఫ్ రేణుభాటియా కూడా ప్రతిస్పందించలేదు. ఈ బీజేపీ నేతను అరెస్టు చేయడం కూడా జరగలేదు.

హర్యానా మహిళా కమిషన్ అధిపతి రేణూభాటియాకు విజయ్ షా వ్యాఖ్యల్లో అభ్యంతరకరమైనది ఏదీ కనిపించ లేదా? ఎందుకని ఆ వ్యాఖ్యలపై మౌనంగా ఉన్నారు.

కల్నల్ సోఫియా ఖురైషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌ల గురించి ప్రొఫెసర్ ఖాన్ రాసిన దాంట్లో అభ్యంతరకరమైన మాటలేమిటో రేణూ భాటియా వివరంగా చెప్పలేదు.

సుప్రీంకోర్టు ప్రొఫెసర్ ఖాన్‌కు ఇంటెరిమ్ బెయిల్ మంజూరు చేసింది.

విజయ్ షా విషయంలో మౌనంగా ఉన్న ప్రభుత్వం ప్రొఫెసర్ ఖాన్ ను అరెస్టు చేసి ప్రజలకు ఇస్తున్న సందేశం ఏమిటి?

విజయ్ షాపై స్వయంగా కోర్టు కల్పించుకుని కేసు పెట్టాలని చెప్పిన తర్వాత మాత్రమే కేసు పెట్టారు. పెట్టిన కేసు కూడా చాలా బలహీనంగా ఉందని కోర్టు వ్యాఖ్యానించింది. ఇంత జరిగినా విజయ్ షా తన పదవిలోనే కొనసాగుతున్నాడు. పార్టీ కూడా ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

హర్యానా రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్‌గా రేణూ భాటియా హర్యానాకు చెందిన మహిళా కుస్తీ క్రీడాకారిణులు రోడ్లపైకి వచ్చి ఆందోళన చేసినప్పుడు మౌనంగా ఉన్నారు. మహిళల హక్కుల కోసం పని చేయాలంటే మాట్లాడవలసిన విషయాలు చాలా ఉన్నాయి. హర్యానాలో ఆడమగపిల్లల మధ్య నిష్పత్తి దారుణంగా పడిపోతోంది. వెయ్యిమంది మగపిల్లలకు 923 మంది ఆడపిల్లలు మాత్రమే ఉన్నారు. రాష్ట్రంలో ప్రతిరోజు మహిళలపై బాలికలపై అఘాయిత్యాలు పెరుగుతున్నాయని నివేదికలు వస్తున్నాయి. ప్రతిరోజు రాష్ట్రంలో 19 నేరాలు మహిళలపై జరుగుతున్నాయని వార్త. మహిళా కమీషన్ చైర్‌పర్సన్‌గా రేణు భాటియా ఈ విషయమై ఏమైనా చేస్తున్నారా?

ప్రొఫెసర్ ఖాన్‌పై ఫిర్యాదు చేసి ఆయన్ను అరెస్టు చేయించడం, బిజేపీ నేత విజయ్ షా బాహాటంగా కల్నల్ ఖురైషీపై చేసిన వ్యాఖ్యలపై పల్లెత్తు మాట చెప్పకపోవడం ... ప్రజలు గమనిస్తూనే ఉన్నారు.

**కవరు కథనం** **అబ్దుల్ వాహెద్**



# హజ్ 2025

హజ్ యాత్ర 2025 ప్రారంభమయ్యింది. ఆదివారం మే 18వ తేదీ నాటికి 5,54,579 మంది హజ్ యాత్రికులు మక్కా చేరుకున్నట్లు సౌదీ వార్తలను బట్టి తెలుస్తోంది. సౌదీ లోని హజ్ ఉమ్రా మంత్రిత్వశాఖ ఈ వివరాలు తెలియజేసింది. హజ్ యాత్రికులు విమానాల ద్వారా, భూమార్గాన మాత్రమే కాదు సముద్ర మార్గాన కూడా కాబాగృహానికి చేరుకుంటున్నారు.

అధికారిక వివరాల ప్రకారం 5,38,766 మంది భూమార్గాన, 14,391 మంది విమానాల ద్వారా, 1422 మంది సముద్ర మార్గాన చేరుకున్నారట. ఈ సంవత్సరం జారీ చేసిన మొత్తం హజ్ వీసాల్లో ఇది 39 శాతం. అంటే ఇంకా 61 శాతం హజ్ యాత్రికులు మక్కా వెళ్ళవలసి ఉంది. జుల్‌ఖాదా నెల ప్రారంభంలో అంటే ఏప్రిల్ 29 నుంచి హజ్ యాత్రికులు మక్కా వెళ్ళడం ప్రారంభమయ్యింది.

హజ్ ఒక విశ్వసమ్మేళనం. హజ్ యాత్రలో వివిధ దేశాలకు చెందిన విభిన్న జాతులు, తెగలు, రంగుల ప్రజలంతా ఒకే వేదికపై సమావేశమవుతారు. అందరి అంతరాంతరాల్లో దేవుడొక్కడే అనే ధార్మిక విశ్వాసం. అందరి బాహ్యాచరణల్లో మనుషులంతా ఒక్కటే అనే మానవ సమానత్వం ఈ వేదికపై కనిపిస్తుంది. ఆఫ్రికా నుంచి వచ్చిన నల్లవారైనా, యూరపు నుంచి వచ్చిన తెల్లవారైనా, ఆసియా నుంచి వచ్చిన గోధుమ వర్ణం వారైనా, సంపన్నులైనా, పేదలైనా అందరూ అక్కడ సమానమే. అందరు ధరించేది ఒకే విధమైన వస్త్రాలు, నిరాడంబరమైన దుస్తులు. అందరూ ఆచరించేది ఒకేవిధమైన క్రియలు. ఈ మానవసమానత్వం మనకు ప్రతి మస్జిదులో కూడా కనిపిస్తుంది. మస్జిదులో నమాజు చేసేవాడు రిక్షాకూలీ అయినా, కులీనవంశీకుడైనా ఒకరి పక్కన ఒకరు నిలబడవలసిందే. హజ్ యాత్రలోని ఈ మానవీయ సందేశం ప్రవక్త ముహమ్మద్ (స)

**అందరి బాహ్యాచరణల్లో మనుషులంతా ఒక్కటే అనే మానవ సమానత్వం ఈ వేదికపై కనిపిస్తుంది. ఆఫ్రికా నుంచి వచ్చిన నల్లవారైనా, యూరపు నుంచి వచ్చిన తెల్లవారైనా, ఆసియా నుంచి వచ్చిన గోధుమ వర్ణం వారైనా, సంపన్నులైనా, పేదలైనా అందరూ అక్కడ సమానమే. అందరు ధరించేది ఒకే విధమైన దుస్తులు, నిరాడంబరమైన దుస్తులు. అందరూ ఆచరించేది ఒకేవిధమైన క్రియలు.**

చిట్టచివరి హజ్ ప్రసంగంలో కూడా స్పష్టంగా ప్రతిధ్వనించింది. ఆధిక్యత అనేది మనిషి పుట్టుకవల్ల, రంగు, రూపం, జాతి, తెగ, సంపద, భాషల వల్ల లభించదు. తెల్లవారికి నల్లవారిపై ఆధిక్యత లేదు, నల్లవారికి తెల్లవారిపై ఆధిక్యత లేదని ఆయన స్పష్టంగా ప్రకటించారు. ఆధిక్యత అనేది దైవభక్తిపై ఆధారపడి ఉంటుంది. దైవభక్తి ఉన్నవాడు అందరినీ సమానంగా చూస్తాడు. నిమ్నోన్నతలు పాటించడు.

హజ్ యాత్ర స్థోమత ఉన్న ప్రతి ముస్లిముపై విధి. ఇస్లాం ఆరాధనల్లో స్థోమత అనేది ప్రతి చోట కనిపిస్తుంది. ఉపవాసాల్లో శారీరకంగా యోగ్యత ఉండడం, అంటే వ్యాధి లేదా ఇతర కారణాలు లేనప్పుడు తప్పనిసరిగా ఉపవాసం పాటించాలి. సంపద ఉన్నంత మాత్రాన పదిమందికి భోజనాలు పెట్టేసి చేతులు దులుపుకుంటానంటే సరిపోదు. పేదలకు అన్నం పెట్టిన పుణ్యం లభిస్తుంది, కాని ఉపవాసాలు పాటించడం మాత్రం తప్పనిసరి. హజ్ యాత్ర కూడా స్థోమత ఉన్న ముస్లిముకు తప్పనిసరి. హజ్ యాత్రలో శారీరక కష్టం కూడా చాలా ఉంటుంది. ఆస్తిపాస్తులున్న సంపన్నుడైనా, కష్టపడి సంపాదించు కునేవాడైనా సరే హజ్ యాత్రలో ఉంటే తప్పనిసరిగా ఈ శారీరక శ్రమకు సంబంధించిన ఆచరణలు చేయవలసిందే. తన బదులు మరొకరితో హజ్ చేయించడానికి అవకాశం లేదు. అయితే హజ్ యాత్ర లోని శారీరక కష్టం భరించలేని బలహీనత, వ్యాధి ఉన్నట్లయితే తన బదులుగా మరొకరిని పంపించవచ్చు. ఇస్లాం అన్ని విషయాల్లోను సౌలభ్యాన్ని ఇచ్చింది. క్రమశిక్షణను కట్టడి చేసింది. నిశితంగా గమనిస్తే ఇందులో అనేక పరమార్థాలు కనిపిస్తాయి.

హజ్ యాత్ర 2025 విషయానికి వస్తే సౌదీ ప్రభుత్వం విజన్ 2030 ప్రకారం మక్కాకు వచ్చే హజ్ యాత్రికుల ఇమ్మిగ్రేషన్, ప్రయాణ ప్రక్రియలో అనేక సదుపాయాలు కల్పించింది. హజ్ యాత్రకు వెళ్ళేవారు సౌదీ అరేబియా అతిథులు కారు, దేవుని అతిథులు. ఈ విషయాన్ని సౌదీ ప్రభుత్వం కూడా మరచిపోదు. అందుకే దేవుని అతిథులకు స్వాగతం అని హజ్ యాత్రికులకు స్వాగతం పలకడం జరుగుతుంది.

ఈ సారి హజ్ యాత్ర నియమ నిబంధనల్లో సౌదీ ప్రభుత్వం చేసిన కొన్ని మార్పులు కూడా విమర్శలకు గురవుతున్నాయి. కొందరు ఈ మార్పులను స్వాగతిస్తున్నారు. 65 సంవత్సరాలకు పైబడి వయసున్న వారెవరైనా హజ్ యాత్ర చేయాలనుకుంటే ఇప్పుడు తమతో పాటు ఎవరినైనా తోడు తీసుకుని వెళ్ళాలి. తోడుగా వెళ్ళేవారి వయసు 18 నుంచి 60 మధ్య ఉండాలి. గతంలో 70 సంవత్సరాలు దాటిన వారికి మాత్రమే ఈ నిబంధన ఉండేది. అలాగే 65 సంవత్సరాలు పైబడిన మహిళ హజ్ యాత్ర చేయాలనుకుంటే కూడా మరో మహిళ తోడు ఉండాలి.

హజ్ యాత్రలో లక్షలాది మంది పాల్గొంటారు. ఈ సారి పిల్లలను కూడా అనుమతించడం లేదు. ఈ నిర్ణయం వారి భద్రత కారణంగా తీసుకున్నామని చెబుతున్నారు. పిల్లలను అనుమతించక పోవడం ఇదే మొదటిసారి. లక్షలాది మంది పాల్గొనే హజ్ యాత్రలో నిర్వహణకు సంబంధించి తలెత్తే సమస్యల్లో పిల్లల భద్రత పెద్ద సవాలు అవుతుంది. ముఖ్యంగా తొక్కిసలాట వంటి పరిస్థితులు తలెత్తితే పిల్లలు ప్రమాదాలకు గురవుతారు. ఈ నిర్ణయాన్ని చాలా మంది స్వాగతిస్తున్నారు. కాని హజ్ వంటి పవిత్ర ఆరాధనలో కుటుంబంతో సహా పాల్గొనే అవకాశం లేకుండా చేశారని కొందరు విమర్శిస్తున్నారు.

హజ్ యాత్రకు వెళ్ళేవారు ఒక ధార్మిక, ఆధ్యాత్మిక యాత్రకు వెళుతున్నారు కాబట్టి నియమ నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలి. ముఖ్యంగా సౌదీ ప్రభుత్వం విధించిన నిబంధనలకు కట్టుబడడం అవసరం. హజ్ యాత్ర సందర్భంగా నిర్వహణ సౌలభ్యం కోసం సౌదీ ప్రభుత్వం విజిట్ వీసాలు, బిజినెస్

వీసాలను కూడా తాత్కాలికంగా నిలిపి వేసింది. హజ్ వీసాలను మాత్రమే అనుమతిస్తోంది. హజ్ నిర్వహణకు ఈ నిబంధనలకు కట్టుబడడం అవసరం.

ఖచ్చితమైన అనుమతులు, హజ్ వీసా లేకుండా హజ్ యాత్రలో పాల్గొంటే దాదాపు 4.5 లక్షల రూపాయల జరిమానా విధిస్తారు. హజ్ కాలంలో దగ్గరి ప్రాంతాల నుంచి మక్కాకు వచ్చేవారైనా సరే హజ్ యాత్రలో అనుమతి లేకుండా పాల్గొనడానికి వీల్లేదు. అనధికారికంగా ఎవరైనా హజ్ యాత్ర చేస్తే, వారికి సహక రించిన వారికి కూడా జరిమానా తప్పదు. ఈ జరిమానా చాలా భారీగా ఉంటుంది. దాదాపు పాతిక లక్షల రూపాయల వరకు ఉంటుంది. అనధికారికంగా హజ్ యాత్ర చేస్తున్నవారికి బస కల్పించినా, రవాణా వసతి కల్పించినా ఈ జరిమానా తప్పదు.

సౌదీ అరేబియా భారతదేశం నుంచి ప్రైవేటు టూర్ ఆపరేటర్ల ద్వారా హజ్ యాత్రకు వెళ్ళేవారి కోటాను హఠాత్తుగా తగ్గిం చేసింది. ఈ విషయంలో ప్రధాని నరేంద్రమోడీ తక్షణం జోక్యం చేసుకోవాలని హజ్ గ్రూప్ ఆర్గనైజర్లు కోరారు.

ఇండియా నుంచి హజ్ యాత్రకు వెళ్ళే ప్రయివేటు టూర్ ఆపరేటర్ల యాత్రికుల కోటా మొదట 52,507గా సౌదీ కేటాయించింది. కాని హఠాత్తుగా ఈ కోటాకు 80 శాతం కోత పెట్టి 10,000కు తగ్గించింది. ఈ సంవత్సరం భారతదేశం నుంచి హజ్ యాత్రకు వెళ్ళేవారి మొత్తం కోటా 1,75,025. ఇందులో ప్రభుత్వ నియంత్రణలోని హజ్ కమిటీ ఆఫ్ ఇండియా ద్వారా 1,22,518 మంది వెళుతున్నారు. హజ్ కమిటీకి సంబంధించిన ఈ కోటాలో ఎలాంటి మార్పు సౌదీ చేయలేదు.

భారతదేశానికి సౌదీకి మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం 2025 సంవత్సరంలో భారతదేశం నుంచి హజ్ యాత్రికుల కోటాను సౌదీ 1,75,025గా కేటాయించింది. ఇందులో 70 శాతం అంటే 1,22,517 మంది హజ్ కమిటీ కోటా క్రింద హజ్ యాత్ర చేస్తారు. గతంలో హజ్ సబ్సిడీ గురించి జరిగిన గగ్గోలు ఈ హజ్ కమిటీ ద్వారా యాత్ర చేసేవారి గురించే జరిగింది. హజ్ సబ్సిడీ గురించి తర్వాత మాట్లాడుకుందాం.

మిగిలిన 30 శాతం మంది ప్రైవేటు హజ్ ఆర్గనైజర్ల ద్వారా హజ్ యాత్ర చేస్తారు. అంటే 52,507 మంది. కాని మొదటిసారి సౌదీ ప్రభుత్వం పేమెంట్ వ్యవస్థలో మార్పులు చేసింది. ఈ మార్పుల వల్ల సకాలానికి చెల్లింపులు జరక్కపోతే సమస్యలు తలెత్తుతాయి. ఈ చెల్లింపుల్లో క్రింది విషయాలు ముఖ్యమైనవి

**సీజనులో లాభాలు సంపాదించుకోవాలనే వ్యాపార ఎత్తుగడ ఇది. ఈ ఎత్తుగడ ప్రకారమే హజ్ సీజనులో విమాన టిక్కెట్టు ధర అమాంతంగా పెరిగిపోతుంది. నిజానికి పెద్ద సంఖ్యలో ప్రయాణీకులు బుకింగ్ చేసుకుంటున్న సందర్భం కాబట్టి డిస్కౌంటు ఎయిర్ లైన్ సంస్థలే ఇవ్వాలి. కాని అలా చేయవు.**

మినాలో శిబిరాల పట్టణం ఏర్పాటు చేయడం జరుగుతుంది. అందులో ఎక్కడ ఉంటారో జోన్ సెలెక్టు చేసుకోవాలి. అలాగే అరఫాత్‌లో ఎక్కడ ఉంటారో ఆ జోన్ సెలెక్టు చేసుకోవాలి.

మినా అరఫాత్‌లలో సర్వీసు ప్రొవైడర్లకు చెల్లింపులు సకాలంలో జరగాలి.

మక్కా మదీనాల్లో బస, రవాణా తదితర సేవలకు సకాలంలో చెల్లింపులు జరగాలి.

హజ్ వీసాలు, ఇన్సూరెన్సులు క్లియర్‌గా ఉండాలి. అయితే ప్రైవేటు ఆపరేటర్ల చెల్లింపుల విషయంలో సమస్య తలెత్తడంతో హజ్ కమిటీయే ప్రయివేటు ఆపరేటర్ల తరపున చెల్లింపులు చేసినట్లు తెలుస్తోంది. కాని సాంకేతిక కారణాల వల్ల ఫిబ్రవరి 14వ తేదీన జరగవలసిన సర్వీసు ప్రొవైడర్ల చెల్లింపులు జరగ లేదు.

సాంకేతిక సమస్యల వల్ల చెల్లింపులు జరగలేదని తెలుస్తోంది. తప్పు ఎవరిదనేది తెలియదు. ప్రయివేటు ఆపరేటర్లదే తప్పని మంత్రిత్వశాఖ చెబుతుంది. మంత్రిత్వశాఖలోని అధికారుల తప్పిదాల వల్లనే ఈ పరిస్థితి తలెత్తిందని ప్రయివేటు హజ్ ఆపరేటర్లు అంటున్నారు. ఏది ఏమైనా దీని తర్వాత సౌదీ అరేబియా ప్రభుత్వం కోటాను తగ్గించింది. వేలాది మంది హజ్ యాత్రికులు ఇప్పుడు ఏం చేయాలో తెలియని పరిస్థితి తలెత్తింది. ప్రధాని నరేంద్రమోడీ జోక్యం చేసుకుని ఈ సమస్యను పరిష్కరించాలని పలువురు విజ్ఞప్తి చేశారు. భారతదేశానికి, సౌదీ

అరేబియాకు మధ్య ఉన్న స్నేహసంబంధాలు, మోడి తనకు ఉన్న పలుకుబడిని ఉపయోగించి ఈ సమస్య పరిష్కరిస్తారని ఆశిద్దాం.

ఇందాక మనం చెప్పుకున్న హజ్ సబ్సిడీ గురించి కూడా మాట్లాడుకుందాం. వక్ఫ్ చట్టంపై దేశవ్యాప్తంగా నిరసన జరుగుతుందన్నది అందరికీ తెలిసిన విషయమే. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తోంది. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో ఒక వార్త వైరల్ అయ్యిందని తెలుస్తోంది. అదేమిటంటే, మోడీ ప్రభుత్వం హజ్ యాత్రికులకు 70 శాతం సబ్సిడీ ఇస్తుందన్న వార్త. ట్విట్టర్‌లో లేదా ఎక్స్ వేదికపై ఈ వార్త చక్కర్లు కొడుతోంది. నిజానికి ప్రభుత్వం 2018లో హజ్ సబ్సిడీని రద్దు చేసింది. అంతకు ముందు హజ్ సబ్సిడీపై చాలా గగ్గోలు ఉండేది. కాంగ్రెసు ప్రభుత్వాలు హజ్ సబ్సిడీ పేరుతో ముస్లిములకు దోచి పెడుతున్నా యని వీరంగాలు వేసిన వారున్నారు. నిజానికి అప్పట్లోనే కాదు అంతకు ముందు కూడా చాలా ముస్లిం సంస్థలు, ముస్లిం మేధావులు హజ్ సబ్సిడీ తమకు అవసరం లేదని ప్రకటనలు చేసి ఉన్నారు. ఎందుకంటే హజ్ యాత్ర అనేది స్థోమత ఉన్న ముస్లిములపై మాత్రమే విధి. కాబట్టి ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీతో హజ్ యాత్ర చేయవలసిన ధార్మిక అవసరమేదీ ముస్లిములకు లేదు.

కాని ఆలోచించవలసిన విషయమేమిటంటే అసలు హజ్ సబ్సిడీ అనేది ఎప్పుడు ఎలా ప్రారంభమయ్యింది? దీనివల్ల నిజంగా హజ్ యాత్రికులకు ఏమైనా లాభం కలిగిందా?


హజ్ సబ్సిడీ అంటే ఏమిటి? హజ్ యాత్రకు వెళ్ళే వారి విమానచార్జిల్లో డిస్కౌంటు ఇవ్వడం. మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే హజ్ కమిటి హజ్ యాత్ర నిర్వహణ చూస్తుంది. యాత్రికుడి విమాన టిక్కెట్టు ధరలో కొంత హజ్ కమిటీ భరించేది, మరికొంత యాత్రికుడు భరించేవాడు. అంటే హజ్ యాత్రికులకు ప్రత్యక్షంగా ఎలాంటి డబ్బు ఇవ్వరు. విమాన చార్జీల్లో మాత్రం డిస్కౌంట్ ఇస్తారు. దేశంలో హజ్ కమిటీ చరిత్ర 1927 నుంచి ప్రారంభమయ్యిందని చెప్పాలి. బ్రిటీష్ కాలం నుంచే ఉంది. అప్పట్లో ముంబాయి నుంచి నౌకల్లో హజ్ యాత్రకు వెళ్ళేవారు. హజ్ సబ్సిడీ ఇవ్వడం అంటే విమాన టిక్కెట్లలో డిస్కౌంటు ఇవ్వడం అనేది ఇందిరాగాంధీ కాలంలో ప్రారంభమయ్యిందని చెబుతారు. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు హజ్ సబ్సిడీలో మర్మాన్ని బయటపెట్టింది. హజ్ యాత్ర కాలంలో మక్కాకు వెళ్ళే ప్రయాణీకుల రద్దీ పెరుగుతుంది. కాబట్టి ఈ సీజనులో విమాన టిక్కెట్ల ధరను అమాంతంగా పెంచేస్తారు. సాధారణంగా ఉండే టిక్కెట్టు ధరకు రెట్టింపు చేసేస్తారు. ఎయిర్ లైన్స్ ఇలా చేయడం మామూలే. ఇటీవల పహల్గాం దాడి జరిగినప్పుడు శ్రీనగర్ నుంచి ఢిల్లీ వెళ్ళాలనుకునే వారికి విమానటిక్కెట్ల ధర అమాంతంగా పెంచేసిన సందర్భం చాలా మందికి గుర్తుండే ఉంటుంది. సీజనులో లాభాలు సంపాదించుకోవాలనే వ్యాపార ఎత్తుగడ ఇది. ఈ ఎత్తుగడ ప్రకారమే హజ్ సీజనులో విమాన టిక్కెట్టు ధర అమాంతంగా పెరిగిపోతుంది. నిజానికి పెద్ద సంఖ్యలో ప్రయాణీకులు బుకింగ్ చేసుకుంటున్న సందర్భం కాబట్టి డిస్కౌంటు ఎయిర్ లైన్ సంస్థలే ఇవ్వాలి. కాని అలా చేయవు. ఈ అమాంతంగా పెంచేసిన టిక్కెట్టు ధరలో కొంత భాగం హజ్ సబ్సిడీ రూపంలో ప్రభుత్వం ఎయిర్ లైన్స్ సంస్థలకు చెల్లించేది. అంటే ఇందులో హజ్ యాత్రికుడికి దొరికేది ఏదీ లేదు. విమాన టిక్కెట్టు ధర తనకు అందుబాటులో లేకపోతే హజ్ యాత్ర చేయవలసిన ధార్మిక అవసరం కూడా ఉండదు. నిజానికి హజ్ సబ్సిడీ అనేది ఎయిర్ ఇండియా వంటి సంస్థలకు బంగారు బాతు అయ్యింది. అసలు ఎయిర్ ఇండియా ద్వారానే వెళ్ళవలసిన అవసరమేముంది? హజ్ కమిటీ టెండర్లను పిలిచి ఎవరు తక్కువ ధరకు సేవలందిస్తారో వారికి ఇవ్వవచ్చు కదా. అలా చేయలేదు. కాబట్టి హజ్ సబ్సిడీ పేరుతో జరిగింది ఒక గగ్గోలు తప్ప ఇందులో ముస్లిములకు హజ్ సబ్సిడీ వల్ల లభించిన ప్రయోజనమేదీ లేదు. గమనించవలసిన విషయమేమిటంటే హజ్ సబ్సిడీకి చేస్తున్న ఖర్చును ముస్లిముల సంక్షేమానికి వెచ్చిస్తామని అప్పట్లో చెప్పారు. ఏ సంక్షేమానికి ఇప్పటి వరకు ఎంత వెచ్చించారో తెలియదు.

ఇప్పుడు హజ్ సబ్సిడీ పేరుతో విమర్శించే అవకాశం కూడా ఎవరికీ లేదు. ఇది ముస్లిములకు మంచిదే. కాని సెక్యులర్ దేశంలో ఇలాంటి సబ్సిడీలు లేవా? కైలాస్ మానస సరోవర్ యాత్ర, సింధూ దర్శన్ యాత్ర, ముఖ్యమంత్రి తీర్థ దర్శన్ యోజన (మధ్యప్రదేశ్) వగైరాల గురించి గూగుల్ చేసి వివరాలు తెలుసుకోవచ్చు, ప్రత్యేకంగా రాయవలసిన అవసరం లేదు.

ఏది ఏమైనా హజ్ 2025 ప్రారంభమైంది. భక్తిశ్రద్ధలతో కాబాగృహానికి యాత్రికులు 'హజరయ్యాను ప్రభూ' అంటూ వెళుతున్నారు. హజ్ యాత్రికులందరికి శుభాకాంక్షలు అందిద్దాం.

# హజ్జ్

## లక్ష్యం, పరమార్థాలు, ప్రయోజనాలు



- డాక్టర్ సాజిద్ అబ్బాసీ

**ఇస్లాం ఐదు మూలస్తంభాలలో హజ్ ఒక ముఖ్యమైన మూల స్తంభం.** స్థోమత ఉన్న ప్రతి ముస్లిం జీవితంలో ఒకసారి తప్పక చేయటం ధార్మిక విధి. ఆధ్యాత్మిక, నైతిక, సామాజిక, ఆర్థిక, రాజకీయ పార్శ్వాలన్నీ ఉన్న విశిష్ట ఆరాధన హజ్ యాత్ర. ప్రతి సంవత్సరం లక్షలాది మంది ముస్లింలు ప్రపంచం నలుమూలల నుండి మక్కాకు వెళతారు. ఒకే రకమైన దుస్తులు ధరించి, ఒకే విధంగా హజ్ క్రియలను ఆచరిస్తారు. దివ్య ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

### ప్రప్రథమ ఆరాధనా గృహం

**"ప్రప్రథమంగా మానవుల కొరకు నిర్మించబడిన ఆరాధనా గృహం నిస్సందేహంగా మక్కాలో ఉన్నదే. దానికి సకల శుభాలు ప్రసాదించబడ్డాయి. విశ్వప్రజలందరికీ అది మార్గదర్శక కేంద్రంగా రూపొందించబడింది. దానిలో స్పష్టమైన సూచనలు ఉన్నాయి, ఇబ్రాహీము ప్రార్థనా స్థలం ఉన్నది. దానిలో ప్రవేశించినవాడు రక్షణ పొందుతాడు. ప్రజలపై అల్లాహ్‌కు ఉన్న హక్కు ఏమిటంటే, ఈ గృహానికి వెళ్ళే శక్తిగలవారు దాని హజ్‌ను విధిగా చెయ్యాలి. ఈ ఆజ్ఞను పాలించటానికి తిరస్కరించేవాడు అల్లాహ్‌కు ప్రపంచ ప్రజల అవసరం ఎంతమాత్రం లేదు అని స్పష్టంగా తెలుసుకోవాలి."**

**(ఆలె ఇమ్రాన్: 96-97)**

ఈ ఖుర్‌ఆన్ వాక్యం ప్రకారం, మానవుల కోసం నిర్మించబడిన మొట్టమొదటి ఆరాధనా స్థలం మక్కాలోని కాబా గృహం. దీనిని ఇబ్రాహీం (అస) కేవలం ఒకే దేవుడైన అల్లాహ్ ఆరాధన కోసం నిర్మించారు. కొన్ని కథనాల ప్రకారం, ఆదమ్ (అస) కాలంలోనే కాబాగృహం నిర్మించబడింది. కాలక్రమేణా ఇది కూలిపోయింది. పాత పునాదులపై దానిని పునర్నిర్మించాలని దైవం ఇబ్రాహీం (అస)కు ఆదేశించాడు. అంటే ప్రపంచంలోనే మొట్టమొదటి, ప్రాచీన ఆరాధనాలయం మక్కాలోని కాబాగృహం. అలాగే, మానవాళి ప్రారంభకాలం నుంచి అల్లాహ్ తరఫున మానవులకు పంపబడిన సత్యధర్మం ఇస్లాం. ఏకదైవారాధన ఈ ధర్మానికి పునాది. మక్కాకు బక్కా అనే మరో పేరు ఉంది, ప్రాచీన గ్రంథాలలో ఈ పేరు ప్రస్తావించబడింది. మానవుల కోసం అల్లాహ్ ఆదేశంపై నిర్మించబడిన ఆరాధనా కేంద్రం కాబా గృహమనడానికి ఈ ప్రస్తావనలు నిదర్శనాలు. అల్లాహ్ మక్కా నగరాన్ని శాంతినగరంగా చేసాడన్నది ఒక నిదర్శనం. ఎందుకంటే, మక్కా చుట్టుపక్కల కల్లోలం, అశాంతి అలుముకుని ఉన్నప్పటికీ (నేడు కూడా ఇలాగే ఉంది), మక్కా శాంతినగరంగానే వెలుగొందింది. ఏకదైవారాధనకు కేంద్రంగా దైవాజ్ఞపై ఇది నిర్మించబడింది. కానీ ఇబ్రాహీం (అస) తరువాత బనీ ఇస్మాయీల్ (ఇస్మాయీల్ సంతతి)లో క్షీణదశ ప్రారంభమయ్యింది. ప్రజలు కాబాగృహంలో విగ్రహాలను ఉంచి దాన్ని అపవిత్రం చేసారు.

## సైద్ధాంతిక ఆధిక్యత

ప్రవక్త ముహమ్మద్ (స)ను దైవం ప్రవక్తగా పంపడంలో ఒక లక్ష్యం ఏమిటంటే, కాబాగృహాన్ని తిరిగి ఏకదైవారాధనా కేంద్రంగా మార్చడం. సైద్ధాంతికంగా ఇస్లాంకు లోకంలో ఆధిక్యత నొసగటం (అల్ తౌబా 33, అస్-సఫ్ 9). ప్రవక్త ముహమ్మద్ (స) కాలంలో అరేబియా ద్వీపకల్పంలో ఇస్లాం ప్రాబల్యం పొందింది. ఆ తర్వాత ఆసియా, ఆఫ్రికా, యూరప్ వరకు ఇస్లాం విస్తరించింది. రాజకీయంగా, సైనికంగా ముస్లిం రాజ్యాలు ఆటుపోట్లను ఎదుర్కొన్నప్పటికీ, ఇస్లాం ఎల్లప్పుడూ విస్తరిస్తూనే ఉంది. ఇప్పటికీ ఇస్లాం కేంద్రంగా మక్కా నగరం అలరారుతూనే ఉంది.

మానవ జీవిత పరమార్థం అల్లాహ్ ఆరాధన. మనిషి చేయవలసిన మొదటి పని తన సృష్టికర్తను తెలుసుకోవటం. సృష్టికర్తను తెలుసు కోకపోతే, మనిషి తన జీవనలక్ష్యంలో విఫలమవుతాడు. సృష్టికర్తను తెలుసుకున్న తర్వాత, సృష్టికర్తను ఆరాధించడం మనిషిపై విధిగా మారుతుంది. ఆరాధన అంటే, సృష్టికర్తను ప్రభువుగా గుర్తించి, దాస్యక్రియలను ఆచరించడంతోపాటు ఆయన పట్ల విధేయత, ఆయన అనుగ్రహాలకు కృతజ్ఞత, ఆయన పట్ల ప్రేమ, ఎల్లవేళలా అల్లాహ్‌నే నమ్ముకోవడం, అల్లాహ్ మార్గంలో సహనంతో కొనసాగడం- అన్నీ చేరి ఉన్నాయి.

## ప్రధాన లక్ష్యం

దాస్యక్రియల్లో నమాజ్, ఉపవాసం, జకాత్, హజ్ ఉన్నాయి. హజ్ యాత్రలో ఆధ్యాత్మిక, శారీరక, ఆర్థిక ఆరాధనలన్నీ ఉన్నాయి. ఇది సమగ్ర ఆరాధన. అల్లాహ్ కాబాగృహాన్ని ముస్లింలందరికీ ఖిబ్లాగా, అంటే కేంద్రంగా చేయడమంటే అర్థం దీనిని ముస్లిం సముదాయ సమైక్యతకు చిహ్నంగా మార్చడం. అంటే, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ముస్లింల ప్రయత్నాలు విభిన్న విధాలుగా కాకుండా ఒకేతీరున ఉండాలన్నది దీని భావం. భౌతికశాస్త్ర సూత్రాల ప్రకారం వివిధ శక్తులు ఒకే దిశలో పనిచేసినప్పుడు, అవి అన్నీ కలిసి చాలా పెద్ద శక్తిగా మారతాయి. కానీ అవే శక్తులు వివిధ దిశల్లో పనిచేస్తే ఒకదాన్ని మరొకటి రద్దు చేసి చివరికి శూన్యమవుతాయి. కాబాగృహం ముస్లిం సముదాయం సమైక్యతకు కేంద్రంగా మారాలని, ఆ విధంగా ముస్లింలందరికీ కార్యాచరణల సమగ్రతకు చుక్కాని కావాలన్నది దైవాభీష్టం. అసత్య శక్తులకు ప్రతిగా ముస్లింల శక్తియుక్తులన్నీ ఒకే లక్ష్యం కోసం కేంద్రీకృతం కావాలి. అప్పుడే సత్యం ప్రాబల్యం పొందుతుంది. మనం పైన చెప్పుకున్న సూరా ఆలి ఇమ్రాన్ వాక్యం తర్వాత 104, 110 వాక్యాల్లో ముస్లిం సముదాయాన్ని ఉద్దేశించి అల్లాహ్ నేరుగా సంబోధిస్తూ, వారి జీవన లక్ష్యాన్ని స్పష్టంగా వివరించాడు. ఆ విషయం ప్రతి ముస్లిం మనోమస్తిష్కాల్లో నాటుకునేలా చేశాడు. ముస్లింలకు ఒకే ఖిబ్లా ఉన్నట్లే, వారి జీవనలక్ష్యం కూడా ఒక్కటే. అల్లాహ్ హితబోధల వెలుగులో ముస్లిం సముదాయం ప్రపంచ మానవాళికి సత్యపథమేదో చూపించడం, మంచిని పెంచడం, చెడును తుంచడం.

## హజ్ క్రియలు

ప్రపంచంలో అసత్య శక్తులు అల్లర్లను, అశాంతిని వ్యాపించేలా చేస్తున్నప్పుడు దైవవిశ్వాసులు మంచిని ప్రోత్సహించాలి, చెడును నిరోధించాలి, సంస్కరణా ప్రయత్నాలు కొనసాగిస్తూ, సమ న్యాయాన్ని స్థాపించాలి. హజ్ చేయగల స్థోమత ఉన్న ముస్లింలపై అల్లాహ్ హజ్ యాత్ర విధిగా చేసాడు. హజ్ చేయగల స్థోమత ఉన్నప్పటికీ హజ్ చేయని వారి నిర్లక్ష్యాన్ని దైవతిరస్కారంగా పరిగణించడం జరిగింది. ధర్మశాస్త్ర పరంగా ఇస్లామీయ కేలండరు జిల్ హజ్జా నెలలో 8 నుండి 13 తేదీల మధ్య మక్కా నగరం, దాని పరిసర ప్రాంతాలలో కేవలం అల్లాహ్ కోసం నిర్వర్తించే ప్రత్యేక క్రియలే హజ్. ఈ ప్రత్యేక ధార్మిక క్రియల్లో కాబా ప్రదక్షిణ, సఫా, మర్వా గుట్టల మధ్య పరుగులాంటి నడకతో తిరగడం, అరఫాత్ మైదానంలో విడిది చేయటం, రమీ జమరాత్ (రాళ్లను రువ్వడం), ఖుర్బానీ ఉన్నాయి. హజ్ క్రియలు ఇబ్రాహీం (అస) జీవితాన్ని గుర్తుచేస్తాయి. ఇబ్రాహీం (అస)ను అల్లాహ్ ప్రత్యేకంగా కొన్ని విషయాలలో పరీక్షించాడు. ఆయన ఆ పరీక్షలో పూర్తిగా నెగ్గారు. అల్లాహ్ ఆయనను మానవజాతికి నాయకునిగా చేసాడు. (అల్ బఖరా 124)

నేడు ప్రపంచంలో యూదులు, క్రైస్తవులు, ముస్లింలు కలిపి ప్రపంచ జనాభాలో సగానికి పైగా ఉన్నారు (4.3 బిలియన్లు). వీళ్ళందరూ ఇబ్రాహీం (అస)ను తమ నాయకునిగా భావిస్తారు. ఆయన ఏకదైవారాధనను ప్రచారం చేశారు. ఏకాగ్రచిత్తంతో తన జీవితాన్ని అల్లాహ్‌కు అంకితం చేశారు. అందుకే సత్యధర్మం ఆచరణాత్మకంగా ఆయన జీవితంతో ముడిపడి ఉంది. అంటే, ఇబ్రాహీం (అస) జీవితం సత్యధర్మానికి ఆచరణాత్మక రూపం. అల్లాహ్ ఆయనను ప్రవక్తల పితామహునిగా చేసాడు. ఇస్రాయీల్ సంతతిలోని ప్రవక్తలందరూ, ఇస్మాయీల్ సంతతిలో చిట్టచివరి ప్రవక్త ముహమ్మద్(స) - వీళ్ళందరు ఆయన సంతతికి చెందినవారే.

## ఖుర్బానీ

హజ్ యాత్రలోని ధార్మిక క్రియలన్నీ ఇబ్రాహీం (అస) జీవితంతో ముడిపడి ఉన్నాయి. ప్రజలను హజ్ యాత్రకు పిలవాలని అల్లాహ్

ఆయన్ను ఆదేశించాడు. (అల్-హజ్: 27). హజ్‌లో తవాఫె జియారత్ ముఖ్యమైన ప్రదక్షిణ. దీనిని తవాఫె ఇఫాజా అని కూడా పిలుస్తారు. కాబాగృహాన్ని నిర్మించి, తవాఫ్, ఎతెకాఫ్, రుకూ, సజ్దాల కోసం దాన్ని పవిత్రంగా ఉంచాలని అల్లాహ్ ఇబ్రాహీం (అస), ఇస్మాయీల్ (అస)లకు ఆదేశించాడు (అల్-బఖరా: 125). సఫా, మర్వా కొండల మధ్య ఏడు సార్లు తిరగడం హజ్ క్రియల్లో ఒకటి. ఇది హజ్రత్ హాజిరాకు సంబంధించిన సంప్రదాయం. ఆమె తన పసిబిడ్డ (ఇస్మాయీల్) దాహం తీర్చడానికి నీటి కోసం ఈ కొండల మధ్య పరుగులు పెట్టారు. ఆమె అల్లాహ్ పట్ల నమ్మకంతో నిర్జనమైన ఎడారి లోయలో ఒక నవజాత శిశువుతో నివసించడానికి సిద్ధపడ్డారు. అల్లాహ్ ఈ ఆచరణకు ప్రళయం వరకు ఆరాధనా స్థాయి కల్పించాడు. రమీ జమరాత్ (రాళ్లను రువ్వడం) అనేది మినాలో మూడు షైతాన్‌లపై రాళ్లను రువ్వడం. ఇది జిల్‌హజ్జా 10 నుండి 13 తేదీ వరకు జరుగుతుంది. ఇది ఇబ్రాహీం (అస) ఆచరణను స్మరించడం. ఆయన తన కుమారుడు ఇస్మాయీల్ (అస) ను బలి ఇవ్వడానికి తీసుకువెళుతున్నప్పుడు షైతాన్ తన దుష్ట పన్నాగాలతో ఆటంకం కల్పించే ప్రయత్నం చేశాడు. ఆయన రాళ్లను రువ్వి ఆ ప్రయత్నాలను నిర్వీర్యం చేశారు. అల్లాహ్ ఆజ్ఞపై తన కొడుకును బలి ఇవ్వడానికి సిద్ధపడిన ఇబ్రాహీం (అస) ఆచరణను, త్యాగనిరతిని స్మరిస్తూ, జ్ఞాపకార్థంగా జంతువును బలి ఇచ్చే ఖుర్బానీ హజ్ క్రియలలో భాగం. ఇది జిల్ హజ్జా 10వ తేదీన జరుగుతుంది. ఈదుల్ అజ్హా లేదా బక్రీద్ పండుగ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు ఖుర్బానీ ఇస్తారు. ఈ హజ్ క్రియలన్నీ త్యాగం, అంకిత భావం, వాగ్దానం నెరవేర్చడం, అల్లాహ్ పట్ల సంపూర్ణ విశ్వాసాన్ని సూచించే ఇబ్రాహీం (అస) జీవితం నుండి తీసుకోబడ్డాయి.

ముస్లిం జీవితాన్ని హజ్రత్ ఇబ్రాహీం (అస) జీవితంతో అనుసంధానిస్తుంది హజ్ యాత్ర. ఇబ్రాహీం (అస)ను అల్లాహ్ దివ్య ఖుర్‌ఆన్‌లో ఏకాగ్రచిత్తుడు (హనీఫ్), విధేయుడు (ఖానిత్), దైవమిత్రుడు (ఖలీలుల్లాహ్) అనే బిరుదులతో ప్రస్తావించాడు. ఒక సందర్భంలో ఇబ్రాహీం (అస) వ్యక్తిత్వం ఒక సముదాయం (ఉమ్మత్) అని చెప్పడం జరిగింది (నహ్ల్ : 120). ఒక వ్యక్తిని ఒక సముదాయం అని చెప్పడం చూస్తే అది ఇబ్రాహీం (అస) సత్యప్రచార విస్తృతిని తెలియజేస్తుంది. ఒక సముదాయం చేయవలసిన పనిని ఆయన ఒంటరిగా చేశారు. ఆయన గురించి ఖురాన్ పదేపదే ప్రస్తావించిన గుణం ఆయన బహు దైవారాధకుడు కానే కాడు అనేది. దురదృష్టవశాత్తు, నేడు ధర్మపరాయణులైన వలీఅల్లాల సమాధులను షిర్క్ కేంద్రాలుగా మార్చారు.

**"మానవులారా! మేము మిమ్మల్ని ఒకే పురుషుని నుండి, ఒకే స్త్రీ నుండి సృజించాము. తరువాత మీరు ఒకరినొకరు పరిచయం చేసుకునేందుకు మిమ్మల్ని జాతులుగానూ, తెగలుగానూ చేశాము. వాస్తవానికి మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే అల్లాహ్ దృష్టిలో ఎక్కువ గౌరవపాత్రుడు. నిశ్చయంగా అల్లాహ్ సర్వజ్ఞానం కలవాడు, సకల విషయాలూ తెలిసినవాడూను."**
**(హుజురాత్: 13)**

ఖురాన్ వంటి పవిత్ర గ్రంథాన్ని కలిగి ఉండి, ఇబ్రాహీం (అస) ఆదర్శాలు ముందున్నప్పటికీ షిర్క్‌కు పాల్పడి, అల్లాహ్ ఆగ్రహానికి గురవుతున్నాం.

హజ్ యాత్ర ఉద్దేశ్య లక్ష్యాలను దివ్యఖుర్‌ఆన్ స్పష్టంగా ప్రకటించింది:

"వారు తమ కొరకు ఇక్కడ ఉంచబడిన ప్రయోజనాలను చూసుకోవాలని" (హజ్: 28). ఈ దైవవాక్కులో హజ్ ప్రయోజనాలను చూడటమే హజ్ లక్ష్యంగా చెప్పడం జరిగింది. హజ్ చేసేవారు తమ కళ్ళతో చూసే హజ్ ప్రయోజనాలు ఏమిటి? హజ్ ప్రయోజనాలు అనేక విధాలు.

### సామాజికం

అల్లాహ్ హజ్ ద్వారా మనకు చూపించదలుచుకున్న ఒక ముఖ్యమైన దృశ్యం ఏమిటంటే, ప్రపంచం నలుమూలల నుండి ముస్లింలు అల్లాహ్ పట్ల ప్రేమతో, ఆయన పిలుపునకు జవాబిస్తూ "లబ్బైక్" (హాజరయ్యాము) అని పలుకుతూ కాబా గృహానికి వస్తారు. జాతి, ప్రాంతం, భాషా భేదాలు అక్కడ కనిపించవు. అందరూ ఒకే రకమైన నిరాడంబరమైన వస్త్రాలు ధరించి, ఒకే విధమైన హజ్ క్రియలు నిర్వర్తిస్తూ, మానవ సమానత్వానికి సజీవ, ఆచరణాత్మక ఉదాహరణగా నిలుస్తారు. హజ్ యాత్రికుల హృదయాల్లో అల్లాహ్ పట్ల ప్రేమ, ఏకదైవారాధక విశ్వాసాలు తొణికిసలాడుతుంటాయి. హజ్ యాత్రికుల అంతరంగంలో దేవుడొక్కడే అనే భావన బలంగాను, బాహ్యంలో మనుషులంతా ఒక్కటే అనే భావన బలంగాను కనిపిస్తుంటుంది. ప్రపంచంలో కలహాలు, యుద్ధాలు, ఘర్షణలు, రక్తపాతాలకు ముఖ్య కారణం జాతి, వర్ణం తదితర నిమ్నోన్నతలే. ఈ దురభిమానాలే విద్వేషాన్ని, విధ్వంసాన్ని సృష్టిస్తున్నాయి. ఈ

విద్వేష, పక్షపాతాలే మనుషుల మధ్య విభజన గోడలు కడుతున్నాయి. రక్తపాతాలకు కారణమవుతున్నాయి. యుద్ధాలకు దారి తీస్తున్నాయి. హజ్ యాత్ర జాత్యాహంకారాన్ని సమూలంగా పెళ్ళగించే ఆరాధన. తెల్లవారు, నల్లవారు, ధనిక, పేద భేదభావాలను నిర్మూలిస్తుంది హజ్. హజ్ యాత్రికులు ఒకే ప్రదేశంలో గుమికూడి దేవుడొక్కడే అనే విశ్వాసానికి సజీవ ఉదాహరణలుగా అల్లాహ్ ఔన్నత్యాన్ని కీర్తిస్తారు. అందరూ సాదాసీదా వస్త్రాలు ధరించి, ఒకే సమయంలో ఒకే రకమైన హజ్ క్రియలు ఆచరిస్తారు. జాత్యాహంకారాన్ని నిర్మూలించడానికి హజ్ కన్నా గొప్ప పరిష్కారం మరేముంది?

## ఆదరణకు ప్రమాణ నికషం

అల్లాహ్ ఖుర్‌ఆన్‌లో ఇలా అన్నాడు: "మానవులారా! మేము మిమ్మల్ని ఒకే పురుషుని నుండి, ఒకే స్త్రీ నుండి సృజించాము. తరువాత మీరు ఒకరినొకరు పరిచయం చేసుకునేందుకు మిమ్మల్ని జాతులుగానూ, తెగలుగానూ చేశాము. వాస్తవానికి మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే అల్లాహ్ దృష్టిలో ఎక్కువ గౌరవపాత్రుడు. నిశ్చయంగా అల్లాహ్ సర్వజ్ఞానం కలవాడు, సకల విషయాలూ తెలిసినవాడూను."

(హుజురాత్: 13)

ప్రపంచంలో శాంతిస్థాపనకు జాత్యాహంకారాన్ని నిర్మూలించడం చాలా అవసరం. జాతి, రంగు ఆధారంగా ప్రజలను విభజించి, ఆధిక్యత వహించిన వారు బలహీనులను దోచుకుంటారు, వారిని బానిసలుగా చేసుకుంటారు, వారిపై అఘాయిత్యాలు చేస్తారు. పుట్టుకతోనే మనిషి అంతరంగంలో న్యూనతాభావాన్ని నాటే బానిసత్వం అత్యంత హీనమైనది. జాతి, రంగు కారణంగా జరిగిన యుద్ధాలు చరిత్రలో అనేకం. బోస్నియా, రువాండాల్లో జరిగిన జాతిహననం మనందరికీ తెలిసిందే. జాత్యాహంకారం నిర్మూలించబడే ఈ గొప్ప దృశ్యాన్ని అల్లాహ్ హజ్ యాత్రికులకు చూపించే గొప్ప దృశ్యం.

## మానవ సమానత్వానికి నికషోపలం

ప్రపంచంలోని ప్రతి దేశం నుండి వివిధ జాతులు, రంగుల మనుషులు, ఒక విశ్వజనీన మహోన్నత సత్యం కోసం ఒకచోట గుమిగూడే దృశ్యమిది. ఆ సత్యం ఏమిటంటే, ఈ యావత్తు విశ్వాన్ని సృష్టించినవాడు ఒకే ఒక్క సృష్టికర్త. హజ్ యాత్రకు మించి మానవ సమానత్వానికి మరో ప్రదర్శన లేదు. మనుషులు కల్పించుకున్న భావాల ఆధారంగా సృష్టించుకున్న జాతి ఆధిక్యత, జాత్యాహంకారాలన్నింటినీ హజ్ తిరస్కరిస్తుంది. జాతి, రంగు, భాషల విచక్షణ లేకుండా కేవలం ఏకదైవారాధన వేదికపై మనుషులందరినీ ఒక్కటి చేస్తుంది. పుట్టుకతో మనుషుల మధ్య ఎలాంటి తేడా లేదని హజ్ చాటి చెబుతుంది. ఏ మనిషీ పాపంతో పుట్టడు, ప్రతి ఒక్కరు మేలైన రీతిలో పుడతారు. కర్మలు, జ్ఞానం, దైవభక్తి రీత్యా మాత్రమే మనుషుల మధ్య తేడాలుంటాయి.

## విశ్వాస కోణం

మనిషి నిస్సహాయుడైనప్పుడు తన కష్టాలను తీర్చే శక్తి శరణు కోరడం మనిషి స్వభావంలో ఉంది. కానీ, నిజమైన సృష్టికర్తను తెలుసుకుని ఆయన్ను సహాయమర్థించే బదులు, సృష్టితాల్లో తనకు నచ్చిన వాటిని సృష్టికర్తగా కల్పించుకుని సహాయం కోరడం జరుగుతోంది. ఈ కాల్పనిక దేవుళ్ళ పవిత్రప్రదేశాలుగా తాము కల్పించుకున్న స్థానాలను దర్శించడానికి వెళుతుంటారు. అక్కడ మొక్కుబళ్ళు చెల్లిస్తుంటారు. అల్లాహ్ మానవుల ధార్మిక విశ్వాసాన్ని సంస్కరిస్తూ, కేవలం ఒకే దేవుడి పట్లనే విధేయత చూపాలని చెప్పాడు. పవిత్రమైన ఆరాధన పద్ధతులను నిర్దేశించాడు. ఈ ఆరాధనా పద్ధతుల్లోనిదే ఖుర్బానీ. హజ్ యాత్ర ఎలాంటి ఆరాధనంటే, ప్రపంచం నలుమూలల నుండి కాబా గృహానికి యాత్రికులు వస్తారు. అల్లాహ్ నిర్దేశించిన ఆరాధనా క్రియలను ఆచరిస్తారు. అల్లాహ్ పేరు మీద ఖుర్బానీ ఇస్తారు. ఖుర్బానీ మాంసాన్ని తాము కూడా తింటారు, పేదలకు కూడా తినిపిస్తారు. ఖుర్బానీ జంతువుల మాంసం లేదా రక్తం దేవునికి చేరదు. మనుషుల్లోని భక్తి భావం మాత్రమే ఆయనకు చేరుతుంది. (హజ్: 37). ఖుర్బానీ గురించి దివ్యఖుర్‌ఆన్ ఇలా చెప్పింది: "కనుక నీవు నీ ప్రభువు కొరకే నమాజు చెయ్యి. ఖుర్బానీ కూడా ఇవ్వు" (కౌసర్: 2) నిజదేవుడిని కాదని కాల్పనిక దేవుళ్ళకు ప్రజలు ప్రణమిల్లడం ప్రారంభించినప్పుడు అల్లాహ్ హజ్ ఆరాధనను విధిగా చేసి, ఆరాధనా పద్ధతులను నేర్పాడు.




## ముస్లిం సముదాయం సమైక్యత

హజ్ యాత్ర సమానత్వాన్ని దర్శింపజేయడంతో పాటు ముస్లిం సముదాయ సమైక్యతకు కూడా నిదర్శనంగా మారుతుంది. ఒకే దేవుడి ఆరాధన, ఒకే ప్రవక్త (స) ఆదర్శం, ఒకే జీవన లక్ష్యం, ఒకే జీవన విధానం (ఖురాన్), ఒకే ఖిబ్లా - ఇవన్నీ ముస్లిం సముదాయ సమైక్యతకు బలమైన పునాదులు.

హజ్ వంటి విశ్వజనీన సమ్మేళనం వల్ల కూడా ముస్లిం సముదాయం సమైక్యం కాకపోతే ఇంకెలా సమైక్యమవుతుంది? సమైక్యతకు ఇన్ని బలమైన పునాదులు ఉన్నప్పటికీ, చిన్నాచితక భేదాభిప్రాయాలపై ముక్కలు చెక్కలెలా అవుతారు? ముస్లిం సముదాయం అసలు లక్ష్యాన్ని మరిచిపోయినప్పుడే చిన్నా చితక విషయాలు ముఖ్యమైనవిగా మారిపోతాయి. సముదాయంలో పగుళ్ళకు కారణమవుతాయి.

హజ్ యాత్ర సందర్భంగా ఏర్పడే పరిచయాలు, సంబంధాలు ఆర్థిక, విద్యా, సామాజిక రంగాలలో సహకారానికి ఉపయోగపడతాయి. హజ్ తర్వాతి రోజుల్లో ముస్లిం ప్రపంచంలోని వివిధ దేశాల మధ్య విభేదాలను తొలగించే వాతావరణం ఏర్పడుతుంది. సహకారం, భాగస్వామ్యాల ప్రయత్నాలు జరగవచ్చు. హజ్ యాత్ర ద్వారా అల్లాహ్ సమైక్యతకు సువర్ణావకాశం కల్పించాడు.

## ఆత్మప్రక్షాళన - పరలోక చింతన:

ఇహ్రామ్ నిరాడంబర శ్వేత వస్త్రాల్లో ప్రాపంచిక అలంకరణలు, కార్యకలాపాలు, అట్టహాసాలకు దూరమై హజ్ యాత్ర చేస్తున్న వ్యక్తికి జీవిత వాస్తవాలను గుర్తించే అవకాశం లభిస్తుంది. ఇహ్రామ్ వస్త్రాల్లో ధనిక, పేద ఒకేలా ఉంటారు. అలాగే మృత్యువు కూడా పదవి, హెూదా, సంపద, పలుకుబడులతో సంబంధం లేకుండా సమానంగానే ప్రతి ఒక్కరికి మరణం తప్పదు. అప్పుడు కూడా ఇహ్రామ్ మాదిరిగానే తెల్లని శవవస్త్రాలు (కఫన్)లో సమాధవుతారు. ఈ విధంగా, ఇహ్రామ్ వస్త్రాలు ధరించిన స్థితిలో మనిషికి తన మరణం స్మరణకు వస్తుంది. అరఫాత్ మైదానంలో ఆగటం, ప్రళయ దినాన హష్ర్ మైదానంలో నిలబడటంగా కనిపిస్తుంటే హజ్ యాత్రికుడు తన జీవితాన్ని, ఆచరణలను ఆత్మావలోకనం చేసుకుని, పశ్చాత్తాపపడే సువర్ణావకాశం లభిస్తుంది. పాపాలన్నింటికీ క్షమాభిక్ష పొందే అద్భుత అవకాశాన్ని హజ్ యాత్ర అందిస్తుంది. హజ్ యాత్రికుడు పాపప్రక్షాళన పొంది ఆ రోజే పుట్టిన బిడ్డ మాదిరి స్వచ్ఛంగా మారుతాడు (సహీహ్ బుఖారీ).

హజ్‌లో మనిషికి ఇంటి సదుపాయాలు, సౌలభ్యాలు, విశ్రాంతి లభించవు. కాబట్టి హజ్‌లో పదేపదే తన ఆత్మగౌరవానికి దెబ్బ తగులుతున్నట్లు అనిపిస్తుంది. హజ్ యాత్రికుల్లో వినయ విధేయతలను ఇది పెంచుతుంది. లక్షలాది మంది ప్రజలు ఒకేసారి ఒకే రకమైన క్రియలు చేయవలసి ఉంటుంది. దీనివల్ల చాలా సందర్భాలలో ఒకరి వల్ల మరొకరికి అసౌకర్యం కలుగుతుంది. మనిషికి కోపం వస్తుంది, గొడవ పడేలా చేస్తుంది. హజ్‌లో ఇహ్రామ్ స్థితిలో ఉన్నప్పుడు మహిళలు తమ ముఖాలను కప్పి ఉంచరు. బహుశా అల్లాహ్ హజ్ యాత్రికులను నైతికంగా పరీక్షిస్తున్నాడు. చూపులను రక్షించుకోకపోతే హజ్ యాత్ర నిష్ఫలం అయిపోయే ప్రమాదం ఉంది.

> **"హజ్ మాసాలు అందరికీ తెలిసినవే. ఈ నిర్ణీత మాసాలలో హజ్ చేసే సంకల్పం ఉన్న వ్యక్తి అప్రమత్తుడై మెలగాలి. హజ్ సమయంలో అతడు కామచేష్టలకూ దుష్కార్యాలకూ, ఘర్షణలకూ దూరంగా ఉండాలి. మీరు చేసే ఏ పుణ్య కార్యమైనా అది అల్లాహ్‌కు తెలుస్తుంది. హజ్ యాత్రకు ప్రయాణ సామగ్రిని తీసుకువెళ్ళండి. భయభక్తులు అన్నిటికంటే ఉత్తమమైన సామగ్రి." (బఖరా: 197)**

ఈ విధంగా, హజ్ యాత్ర యావత్తు ఆత్మ ప్రక్షాళన సాధనంగా మారుతుంది. హజ్ సందర్భంగా క్రమానుగతంగా, సమయబద్ధంగా వివిధ క్రియలు చేయవలసి ఉంటుంది. కాబట్టి క్రమశిక్షణ, నియంత్రణ అలవడతాయి. హజ్ క్రియలకు సంబంధించిన వివేకవివేచనాలు తెలిసినా తెలియకపోయినా తూ.చ. తప్పకుండా ఆచరించే పరిస్థితి మనిషిలో స్వీయ సమర్పణను, విధేయతను సృష్టిస్తుంది. హజ్ యాత్రలో అనేక సందర్భాలలో ఇతరులకు సహాయం చేయడం లేదా ఇతరుల నుండి సహాయం తీసుకోవడం జరుగుతుంది. దీనివల్ల పరస్పర సహకార భావం అలవడుతుంది. ఆరాధనలు, దైవ నామస్మరణలతో పాటు, ఈ విషయాలన్నీ అల్లాహ్‌కు చేరువయ్యే సాధనాలుగా మారతాయి. హజ్ లక్షలాది మందితో కలిసి చేసే సాముదాయిక ఆరాధన. కాబట్టి, ప్రతి వ్యక్తికి మరొకరి నుండి ఆధ్యాత్మిక బలం లభించే ఒక ఆధ్యాత్మిక వాతావరణం ఏర్పడుతుంది. హజ్‌లో శారీరక శ్రమ ఉంటుంది. ఆ విధంగా హజ్ యాత్ర దైవమార్గంలో శ్రమించే శిక్షణా కార్యక్రమం కూడా అవుతుంది. దైవమార్గంలో ఎంత కష్టమైనా భరించే శిక్షణనిస్తుంది హజ్.

హజ్ అనేది మానవ జీవితంలోని ప్రతి కోణాన్ని స్పర్శించే ఒక సమగ్ర ఆరాధన. ఇది ఒక విధిగా చేసే ఆరాధన మాత్రమే కాదు, ఒక గొప్ప శిక్షణా శిబిరం కూడా. హజ్ ద్వారా, మనిషికి ఆధ్యాత్మిక ఉన్నతి, నైతిక పరిశుభ్రత, అల్లాహ్ క్షమాపణ, సామాజిక చైతన్యం, సమైక్యత వంటి ప్రయోజనాలు లభిస్తాయి. హజ్ మనిషిలో వినయాన్ని సృష్టించి, అల్లాహ్‌కు దగ్గర చేసి, పరలోక సాఫల్యానికి తోడ్పడుతుంది.



ఉమైర్

# ఆర్థిక న్యాయం ఎలా సాధ్యం?

**ప్రపంచంలో** అసమానత్వం అనేది ఎవరు ఒప్పుకున్నా ఒప్పుకోక పోయినా ఒక చేదు వాస్తవం. ప్రభుత్వాలు ఈ వాస్తవాన్ని ఒప్పుకోడానికి ఇష్టపడవు. అలాగే, ఈ వాస్తవాన్ని తిరస్కరించడానికి సాహసించవు. మౌనమే మేలనుకుంటాయి. కాని అసమానతలు ఒక స్థాయిని మించితే అసహనం, ఘర్షణలు ప్రారంభమవుతాయి. పరిస్థితి ప్రమాదకరంగా మారుతుంది. ఇప్పుడు అలాంటి పరిస్థితులే మనముందుకు వస్తున్నాయి. గ్లోబలైజేషన్, ఉదారీకరణ, కార్పొరేటీకరణల ప్రపంచంలో సంపద ఒకే చోట పోగుపడడం మామూలైపోయింది. ఈ పరిస్థితి మనదేశంలోనూ ఉంది. సంపన్ను లకు, పేదలకు మధ్య అఖాతం మరింత పెరుగుతూ పోతోంది. ఈ పరిస్థితులపై నోబుల్ శాంతి బహుమతి గ్రహీత, ప్రముఖ మేధావి బంగ్లాదేశ్‌కు చెందిన ముహమ్మద్ యూనిస్ ఈ విషయమై హెచ్చరికలు కూడా చేశారు. ప్రపంచంలో సంపద అంతా కేవలం కొద్ది మంది గుప్పిట్లో ఇరుక్కుపోయిందని, ఫలితంగా ప్రపంచంలో ఆర్థిక వ్యవహారాలు ఒక టైంబాంబు మాదిరి తయారయ్యాయని, అదెప్పుడైనా పేలే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ పరిస్థితిని చక్కదిద్దడానికి చర్యలు తీసుకోకపోతే పరిస్థితిని తర్వాత అదుపు చేయడం చాలా కష్టమవుతుంది. అల్ అరబియా న్యూస్‌తో మాట్లాడుతూ ఆయన ఈ మాటలు అన్నారు.

ప్రస్తుతం ప్రపంచంలో ఆర్థిక అసమానతలు, సంపద కొద్దిమంది చేతుల్లో పోగుపడిపోవడం ఎంత తీవ్రంగా ఉందంటే, ప్రపంచంలో 99 శాతం సంపద కేవలం ఆరు దేశాల్లో ఉంది. ప్రపంచంలో 50 శాతం కన్నా ఎక్కువ సంపద కేవలం 8 మంది వ్యక్తుల చేతుల్లో ఉంది. ఇది ఆర్థిక వ్యవస్థ అని చెప్పలేం. ఇది ఆర్థిక వ్యవస్థ పేరిట జరిగే పెద్ద దోపిడీ అని మాత్రమే చెప్పగలం. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థ కేపిటలిజం పునాదులపై నిలబడి ఉంది. గ్లోబలైజేషన్ ద్వారా అది మరింత విస్తరించింది. ఇప్పుడు సాంప్రదాయిక బ్యాంకులన్నీ ఈ కేపిటలిస్టు, గ్లోబలైజేషన్ వ్యవస్థలో అంతర్భాగాలే. అందువల్ల ఈ బ్యాంకుల్లో ఒక రైతుకు రుణం కావాలంటే చాలా కష్టం. ఒక పేదవాడికి చిన్నపాటి రుణం కావాలంటే ఎన్నో హామీలు, గ్యారంటీలు అవసరం. కాని అదే ఒక కార్పోరేట్ సామ్రాజ్యానికి భారీమొత్తంలో రుణం అవసరమైతే ఎలాంటి హామీలు, గ్యారంటీల అవసరం ఉండదు. ఈ వాస్తవా లను డాక్టర్ ముహమ్మద్ యూనిస్ ఒక్కరే కాదు ఇంకా చాలా మంది ఆర్థికవేత్తలు కూడా చెప్పారు. కేపిటలిస్టు వ్యవస్థ పూర్తిగా ధనవంతుల ఆర్థిక క్రీడ తప్ప మరేమీ కాదని స్పష్టం అవుతోంది. కేపిటలిస్టు వ్యవస్థకు ప్రాణం అమెరికన్ డాలర్. అమెరికన్ డాలర్ల కబంధహస్తాల్లోనే నేడు ప్రపంచ ఆర్థిక వ్యవహారాలు ఇరుక్కుని ఉన్నాయి. అమెరికా విధించే ఆర్థిక ఆంక్షలకు లొంగని దేశాలంటూ లేవు.

కేపిటలిస్టు, వడ్డీ ఆధారిత బ్యాంకింగ్ వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా ఇస్లామిక్ ఫైనాన్సింగ్‌కై కొన్ని ముస్లిం దేశాలు ప్రయత్నించాయి. కాని ఇస్లామిక్ ఫైనాన్సింగ్ కూడా ఏదో ఒక రూపంలో కేపిటలిస్టు ఆర్థిక వ్యవస్థ ఒత్తిళ్ళ మధ్యనే పనిచేయవలసి వస్తోంది. ఇస్లామిక్ ఫైనాన్సింగ్ వైపు మొగ్గు చూపుతున్న ముస్లిం దేశాలు కూడా అంతర్జాతీయంగా కేపిటలిస్టు వ్యవస్థ చట్రంలోనే ఇరుక్కుని ఉన్నాయి. ఇటీవల డావోస్‌లో వరల్డ్ ఎకానమిక్ ఫోరమ్ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ రైట్స్ గ్రూప్ ఆక్స్ ఫామ్ నివేదిక కూడా వచ్చింది. ఈ నివేదిక ప్రకారం 2017లో ప్రపంచం లోని మొత్తం సంపదలో 82 శాతం సంపద ప్రపంచంలో కేవలం ఒక్క శాతం ఉన్న సంపన్నుల చేతుల్లో ఉందని, భారతదేశంలో 73 శాతం సంపద భారత జనాభాలోని కేవలం ఒక్క శాతం

సంపన్నుల చేతుల్లో ఉందని ఆ నివేదిక తెలిపింది. అంతేకాదు సంపన్నుల ఆస్తులు 4.89 లక్షల కోట్ల నుంచి 20.7 లక్షల కోట్లకు పెరిగాయని కూడా తెలియజేసింది.

ప్రపంచవ్యాప్తంగా కేవలం పేదవాళ్ళే కష్టపడి సంపాదిస్తారు. కాని వారి ఆర్థిక పరిస్థితి దయనీయంగానే ఉంటుంది. వారి జీవన ప్రమాణాలు పెరగవు. వారి కష్టం సంపన్నుల ఆస్తులు పెరగడానికి మాత్రమే ఉపయోగపడుతోంది. సంపన్నులు పేదల బతుకు గురించి ఆలోచించడం మాత్రం ఎక్కడా కనబడదు. సంపన్నుల ఆస్తులు పెంచడానికి కష్టపడడంలోనే పేదల బతుకులు గడిచి పోతాయి. తమ కోసం వారు చేసుకునేది ఏదీ ఉండదు. ఇంతకు మించి మార్గం కూడా లేదు. కేపిటలిస్టు చట్రంలో సంపన్నుల ఆర్థిక క్రీడల్లో పావులు మాత్రమే పేదలు. సంపద పంపిణీలో ఎన్నడూ న్యాయం జరగని ఈ వ్యవస్థలో పేదలకు మరో దారి కూడా ఉండదు. సంపన్న వ్యాపార సామ్రాజ్యాలకు బ్యాంకుల నుంచి చాలా తేలిగ్గా వేల కోట్ల రుణాలు లభిస్తాయి. అవసరమైతే ఆ రుణాలను రైట్ ఆఫ్ చేయడం ద్వారా వారి మీద ఒత్తిడి కూడా ఉండదు. అవసరమైతే దేశం వదిలి పారిపోయే అవకాశాలు, వనరులు వారి వద్ద ఉంటాయి. అంతర్జాతీయ చట్టాల చాటున దాక్కునే మార్గాలు వారికి తెలుస్తాయి. తమ కోసం న్యాయస్థానాల్లో పోరాడ్డానికి పెద్ద పెద్ద న్యాయవాదులను నియమించుకునే స్థోమత కూడా వారికి ఉంటుంది. కాని పేదలకు కొన్ని వేల రూపాయల రుణం అవసరమైన బ్యాంకుల చుట్టూ తిరిగి తిరిగి అలసిపోవలసి ఉంటుంది. అనేక హామీలు గ్యారంటీలు సమర్పించుకోవలసి ఉంటుంది. రుణం తీర్చడంలో ఆలస్యమైతే పోలీసు వ్యవస్థ బ్యాంకులకు మద్దతుగా నిలబడు తుంది. వారి వద్ద ఉన్న కొద్దో గొప్ప ఆస్తులను వేలం వేసి మరీ వసూలు చేసుకుంటారు. గ్లోబలైజేషన్ వ్యవస్థలో వెయ్యి రూపాయలు జేబులో ఉన్నవాడు దాన్ని రెండువేలుగా మార్చడం సాధ్యం కాదు. తాను బతకడానికి ఖర్చుపెట్టక తప్పదు. కాని కోటి రూపాయలు ఉన్నవాడు రెండుకోట్లుగా మార్చుకోవడం సులభం. ఈ వ్యవస్థ కేవలం సంపన్నులకు మాత్రమే అనుకూల మైనది.

ప్రభుత్వం కూడా కేవలం ప్రజాకర్షక పథకాలు కొన్ని ప్రకటించడం ద్వారా పేద మధ్యతరగతి ప్రజలను బుజ్జగిస్తుంది తప్ప అంతకు మించి మరేమీ చేయదు. రైతుల రుణమాఫీ అప్పుడప్పుడు చేస్తుంది తప్ప అస్సలు రుణాలు తీసుకునే అవసరమే లేకుండా రైతులు ఆర్థికంగా ఎదిగే చర్యలు చేపట్టదు. ప్రభుత్వం ఇటీవల పన్నుల వ్యవస్థలో పెద్ద మార్పు అంటూ జియస్టీ తీసుకొచ్చింది. కాని వ్యాపారాలు దెబ్బతింటాయన్న ఒత్తిడి పెరగగానే నెమ్మదిగా జియస్టీ రేట్లు తగ్గిస్తూ పోయింది. కాని రైతులు గిట్టుబాటు ధర కోసం ఎప్పటి నుంచో మొత్తుకుంటున్నా ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఏమున్నాయి? అలాగే నోట్లరద్దు జరిగినప్పుడు పేదలు విలవిలలాడినా ఎవరూ పట్టించుకోలేదు. కాని పెద్దమొత్తాల్లో కొత్త నోట్లు చాలా మంది వద్ద దొరికాయి. అది ఎలా సాధ్యం? రోజు కూలి చేసుకుని సంపాదించే పేద బడుగు ప్రజలు బ్యాంకుల ముందు క్యూల్లో నిలబడవలసి వచ్చింది. ఎంతమంది సంపన్నులు క్యూలో నిలబడ్డారో ఎవరైనా చూశారా? చిల్లర వ్యాపారాలు, చిన్నా చితక వ్యాపారాలన్నీ కూలబడ్డాయి. కార్పొరేట్ చైన్ షాపులకు అనుకూలమైన వాతావరణం ఏర్పడింది. నోట్లరద్దు వల్ల సంపన్నులెవరైనా రోడ్డున పడిన ఒక్క ఉదాహరణ మన ముందుకు వచ్చిందా? ఇంట్లో కూర్చునే తమ పాత నోట్లను కూడా మార్చుకున్నారు. గట్టిగా మాట్లాడితే నల్లధనం కూడా మార్చేసుకున్నారని చెప్పాలి. ఇదీ కేపిటలిజం, క్రోనీ కేపిటలిజం మహత్తు.

ప్రపంచంలో ఏ దేశంలో అయినాసరే సంపన్నుల ఆస్తులు పెరుగు తున్నాయి, పేదల జనాభా కూడా పెరుగుతోంది. సంపద కేవలం కొద్ది మంది చేతుల్లో పేరుకుపోతోంది. సంపద వనరులన్నింటిపై వారి ఆధిపత్యమే, పరిపాలన, రాజకీయాల్లోనూ వారి ఆధిపత్యమే. కొన్నాళ్ళ క్రితం అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్, నేషనల్ ఎలక్షన్ వాచ్ నివేదిక వచ్చింది. ఈ నివేదిక ప్రకారం భారతదేశంలో 25 మంది ముఖ్యమంత్రులు అపర కుబేరులే. త్రిపుర మాజి ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ వంటి వారు ఇప్పుడు బహుశా ఎక్కడా కనబడకపోవచ్చు. ప్రభుత్వం ఇప్పుడు ఒక కార్పొరేట్ సామ్రాజ్యం మాదిరిగా వ్యవహరిస్తుంటే, ప్రజల సంక్షేమం కన్నా, ప్రజలకు ఉపాధి అవకాశాల కన్నా కార్పొరేట్ ప్రయోజనాలే ముఖ్యంగా పనిచేస్తుంటే బడుగు బలహీన పేద ప్రజల బతుకులు బాగుపడడం అన్నది జరిగేపని కాదు. దోపిడీకి అవకాశం ఉన్న వ్యవస్థల్లో దోపిడీ పెరిగినప్పుడు సంక్షోభాలు తలెత్తుతుంటాయి. అనేక ఆర్థిక సంక్షోభాలను ప్రపంచం చవిచూసింది. గ్లోబలైజేషన్ గురించి మాట్లాడిన దేశాలు ఇప్పుడు తమ సొంత ప్రయోజనాల గురించి మాట్లాడడం కూడా మనం చూస్తున్నాం.

ఈ ఆర్థిక వ్యవస్థలో ఒక మనిషి ఆర్థికంగా ఎదగాలంటే మరొకరిని అణచివేసే పరిస్థితే ఉంది. అందరికీ సమానంగా ప్రగతి సాధించే అవకాశాలు లేవు. వ్యవస్థ డొల్లతనాన్ని వడ్డీ రేట్లను తగ్గించడమూ పెంచడమూ ద్వారా ఆటంకం వేయడం కొనసాగుతూనే ఉంది. ఇది వ్యవస్థలోనే ఉన్న లోపం. సంపన్నులకు పేదలకు మధ్య అఖాతాన్ని పెంచే వ్యవస్థ, సంపద కేవలం కొద్ది మంది చేతుల్లోనే గుట్టలయ్యే వ్యవస్థ సమస్యలను పరిష్కరించడం సాధ్యం కాదు.

వారి సంపదలో యాచకులకూ, అగత్యం కలవారికీ హక్కు ఉండేది. (దివ్య ఖుర్ఆన్ 51: 19)

సంపన్నుల సంపదలో పేదలకు హక్కుగా కొంత భాగం ఉందని నిర్దేశించే విధానాలు నేటి అవసరం.

కథ

# అనుభవాలే ఉపాధ్యాయులు

- షహనాజ్‌బేగం, అనంతపురం



**ఒక** మనిషి పరిస్థితుల ప్రాబల్యం వల్లనో, జీవితంలో క్రమశిక్షణా రాహిత్యం కారణంగానో ఎంతగా దిగజారిపోతాడో ఆసిఫ్‌ను చూస్తుంటే అవగతమవుతుంది.

కొంతకాలం వరకు అతను సచ్ఛీలుడు. అబద్ధాలు చెప్పి ఎరుగడు. ఎవరినీ మోసగించి ఎరుగడు. అన్నిటికంటే ముఖ్యం తన కుటుంబీకులను, తన కన్నవారిని, తన తోబుట్టువులను అమితంగా ప్రేమించేవాడు. వారిని ఆదరంగా చూసేవాడు.

ఏదో పెద్ద వ్యాపారం చేస్తున్న అతను తన స్వయం కృతంతో చాలా నష్టపోవాల్సి వచ్చింది. అతను నమ్మినవారే అతనిని మోసగించడంతో మరింత నష్టపోయాడు. అంతేకాక అతను విచ్చలవిడిగా ఖర్చుపెట్టడం కూడా ఒక కారణమైంది. అతనిలో ఆర్థిక క్రమశిక్షణ లేకపోయింది. ప్రణాళికాబద్ధంగా జీవితాన్ని గడపలేదు.

అప్పులపాలయ్యాడు. అందినచోటల్లా అప్పులు చేశాడు. అతని భార్యాపిల్లలు సైతం అతనికి అండగా నిలవలేకపోయారు. పైపెచ్చు చేతులారా ఇంత దుస్థితికి దిగజారావు అంటూ దూషించ సాగారు. ముందు చూపు లేకపోవడం ఈ దుస్థితికి కారణమైందని దెప్పిపొడిచేవారు.

స్నేహితులు దూరమయ్యారు. అతను ఒంటరి వాడయ్యాడు. అప్పటికీ అక్కడక్కడ ఏవో అబద్ధాలు చెప్పి అప్పులు పుట్టించు కునేవాడు. చేతిలో డబ్బులు వుంటే అతనికి ఒళ్లు తెలిసేది కాదు. తన ఆనందం కోసం ఎంత డబ్బయినా ఖర్చు పెట్టడానికి వెనుకాడేవాడు కాడు. అదే అతని పతనానికి కారణమయింది.

మతిస్థిమితం లేక అనిశ్చితి ఏర్పడింది. అతని దిగజారుడుతనానికి మరో ఉదాహరణగా అతను తన స్నేహితుల దగ్గర అప్పుల కోసం వెళ్తున్నప్పుడు తన భార్యను కూడా తోడు తీసుకొని వెళ్ళేవాడు. తమ బలహీనతతోనో, ఆమె వచ్చిందనో మొహమాటపడిపోతూ అప్పులిచ్చేవారు. అవి ఎప్పటికీ తిరిగి రావని వారికి తెలుసు.

లోలోన అతన్ని తిట్టుకుంటూ, ఒక్కోసారి అతనిని అనరాని మాట లంటూ అప్పులు ఇచ్చేవారు. అంతేగాక అతను ఇన్నాళ్లూ అమితంగా ప్రేమించే తల్లిని సైతం ఊర్లో ఉన్న తమ ఇంటిని అమ్మేయాలని వేధించేవాడు.

అతని వేధింపులకు తట్టుకోలేక తన ఇంటిని అమ్మకానికి పెట్టిందా తల్లి. చివరకు ఆమెకు, ఆమె మిగతా పిల్లలకు ఏ అవసరం లేకున్నా ఆ ఇంటిని అమ్మవలసి వచ్చింది.

ఇంటిని అమ్మిన డబ్బుతో కొన్నాళ్లపాటు బాగానే జరిగింది అతనికి. అప్పుల వాళ్ళ వేధింపులు తగ్గాయి. అలా కొంతకాలం జరిగింది. డబ్బులు చేతిలో పడగానే అతని ఆలోచనలు మారాయి. మళ్ళీ తిరిగి అదే పరిస్థితి నెలకొంది. ఆర్థిక ఇబ్బందులు ఏర్పడ్డాయి.

కారణం.. అతని జీవితంలో ఆర్థికపరమైన క్రమశిక్షణ లోపించటమే. చేతిలో డబ్బు ఉన్నంత కాలం అతనికి ఒళ్లు తెలియలేదు. ఆడంబరాలకు, డాంబికాలకు పోయి జీవితంలో మనశ్శాంతిని కోల్పోయాడు.

ఆడపిల్లలు పెళ్ళీడుకు వచ్చారు. చూస్తుండగానే పెళ్లి వయసు దాటిపోతోంది. పెళ్ళిళ్ళు చెయ్యడానికి చేతిలో డబ్బుల్లేవు.

ఒకసారి ఒక జీవనశైలికి అలవాటుపడిన మనిషి తిరిగి మరో జీవితానికి అలవాటు పడటం కష్టమే. అతనికి ఎన్ని ఎదురు దెబ్బలు తగిలినా కోలుకోలేడు. తిరిగి అదే జీవితాన్ని కోరుకుంటాడు తప్ప తన జీవితాన్ని సరైన దారిలో పెట్టుకుందా మనుకోడు. దాని నుండి బయటపడడు.

అది ఒక వ్యసనం లాంటిది. అతని పిల్లలు కూడా అదే జీవితానికి అలవాటుపడ్డారు. సుఖప్రదమైన జీవితాన్ని కోరుకున్నారు. ఇంట్లో ఏమి తక్కువైనా సరే నానా రభస చేసేవారు. క్రమక్రమంగా ఆ ఇంట్లో ఆర్థిక లేమి అనిశ్చితి ఏర్పడసాగింది. కానీ అతని కొడుకు ఇమ్రాన్‌లో ఏదో సంచలనం లాంటిది ఏర్పడింది. చిన్నప్పట్నుంచి తన తండ్రిని గమనిస్తూ రావడంతో అతనిలో ఏవో ఆలోచనలు మొగ్గ తొడగ సాగాయి.

తండ్రి పట్ల వ్యతిరేక భావనలు ఏర్పడసాగాయి. అతనిని అనుసరించలేకపోయాడు. కానీ తండ్రి పట్ల ప్రేమాభిమానాలు మెండుగా ఉన్నాయి. జీవచ్ఛవంలా తయారైన తన తండ్రి తిరిగి పుంజుకోవాలని, నిండా మునిగిన తన తండ్రిని గట్టుకు చేర్పించాలని గట్టిగా సంకల్పించాడు.

మొదట తను అన్ని రకాల క్రమశిక్షణను అలవర్చుకుని ముందుకు సాగాలని నిశ్చయించుకున్నాడు.

ఒక పక్క కాలేజీలో చదువుకుంటూనే తన తండ్రి చేస్తూ వదిలేసిన వ్యాపారాన్ని చిన్నగా చేపట్టాడు. తన తండ్రి దగ్గర పనిచేసిన వారందరినీ ఒకచోట చేర్చి పని ప్రారంభించాడు. చిన్నగా వ్యాపారం సాగింది. వ్యాపార నైపుణ్యతను నేర్చుకున్నాడు. క్రమక్రమంగా వ్యాపారం నిలదొక్కుకుంది. వచ్చిన డబ్బును జాగ్రత్తగా ఖర్చు పెట్టసాగాడు. మెల్లిగా తండ్రి చేసిన అప్పులను తీర్చసాగాడు.

అతని తండ్రి జీవితమే అతనికి గుణపాఠమయ్యింది- జీవితమంటే మరీ అంత సులభతరమైంది కాదని, ఆచితూచి అడుగులు వెయ్యాలని, ఒకసారి తప్పటడుగులు వేశామంటే అథఃపాతాళానికి చేరిపోతామని. జీవితంలో నీతి నియమాలను కూడా పాటించాలని, వాటిని విస్మరిస్తే ఫలితాలు చాలా దారుణంగా వుంటాయన్న సత్యాన్ని కూడా తెలుసుకున్నాడు. తన తండ్రిలా దిగజారకూడదు అనుకున్నాడు.

ఆ కుర్రాడిలోని మంచితనం, క్రమశిక్షణ, నీతి నిజాయితీ, పట్టుదలను చూసి ఇతర సంస్థలు అతనికి ఆర్థిక సాయం అందజేసి వ్యాపారంలో ప్రోత్సహించాయి. అతని కుటుంబం బాగు పడింది అలా....

పిల్లలు తల్లిదండ్రులను చూసి అనుసరిస్తారనుకుంటారు చాలామంది. కాని చెడుదారులు పట్టిన తల్లిదండ్రులను చూసి తమ జీవితాలను సరిదిద్దుకున్న వాళ్ళు కూడా ఎంతో మంది ఉన్నారు.

పెద్దవారి జీవితాలే వారికి గుణపాఠాలవుతాయి. కానీ పెద్ద వారి జీవితాలు ఎప్పటికీ పిల్లలకు మార్గదర్శకాలు కావాలి. ఇలాంటి వారి జీవితాలు కొంతమందికైనా స్ఫూర్తినివ్వాలి.


యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి గీటురాయి వారపత్రికను తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే డి.డి.ని 'Geeturai Weekly' పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్హీముల్ ఖుర్‌ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్‌ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

35 ఆయత్‌లు మక్కా అవతరణ

# 46. అల్ అహ్కాఫ్

1 – 2 హా, మీమ్; ఈ గ్రంథ అవతరణ మహాశక్తి సంపన్నుడు, వివేచనా ధురంధరుడు అల్లాహ్ తరపున జరుగుతోంది.[1]

3 మేము భూమిని, ఆకాశాలను, వాటి మధ్యనున్న సమస్త పదార్థాలను ధర్మబద్ధంగానూ, ఒక ప్రత్యేక కాల వ్యవధి నిర్ణయంతోనూ పుట్టించాము.[2] కాని ఈ తిరస్కారులు వారికి ముందే హెచ్చరించిన ఆ యదార్థానికి విముఖులయి ఉన్నారు.[3]

1. వివరణ కోసం చూడండి, ఖుర్‌ఆన్ అవగాహనం, సం.7, అజ్ జుమర్: పాదసూచి 1, అల్ జాసియా: పాదసూచి1, వీటితో పాటు సం.6, అస్ సజ్దా: పాదసూచి 1 కూడా దృష్టిలో ఉన్నట్లయితే ఈ ప్రారంభ వచనాల సారం అర్థం చేసుకోవడం సులభమవుతుంది.

2. వివరణకు చూడండి, ఖుర్‌ఆన్ అవగాహనం, సం.2, అల్ అన్ ఆమ్: పాదసూచి 46; సం.3, యూనుస్: పాదసూచి 11; సం.4, ఇబ్రాహీమ్:పాదసూచి 26; అల్ హిజ్ర్: పాదసూచి 47; అన్ నహ్ల్: ఆయత్:3 పాదసూచి 6; అంబియా: ఆయత్‌లు 16–18; పాద సూచికలు 15–17; సం.5, అల్ మూ'మినూన్: పాద సూచి 102; సం.6, అల్ అన్కబూత్: పాదసూచికలు 75, 76; లుక్మాన్: పాదసూచి 51; సం.7, అద్ దుఖాన్: పాదసూచి 34; అల్ జాసియా: పాదసూచి 28.

3. అంటే, వాస్తవిక యదార్థం ప్రకారం ఈ విశ్వవ్యవస్థ ఒక లక్ష్యరహితమయిన ఆట వస్తువు కాదు. ఇదొక లక్ష్యవిహితమయిన విజ్ఞతాపూర్వకమయిన వ్యవస్థ. ఇందులో తప్పనిసరిగా సదాచారులు, దుర్వర్తనులు, దౌర్జన్యపరులు, బాధితులు అందరి ఎడల న్యాయం జరగవలసి ఉంది. ప్రస్తుత విశ్వవ్యవస్థ శాశ్వతమయినదీ, అనంతమయినదీ కాదు. దీనికి ఒక ప్రత్యేక కాల వ్యవధి నిర్ణయమయి ఉంది, దాని అంతంలో ఇది తప్పనిసరిగా ఛిన్నాభిన్నమయిపోవలసి ఉంది. దైవ న్యాయస్థానానికీ ఒక కాలం నిర్ణీతమయి ఉంది. ఆ సమయం వచ్చినప్పుడే అది తప్పక నెలకొంటుంది. కాని ఎవరయితే దైవప్రవక్తను, ఈ గ్రంథాన్నీ నమ్మడానికి నిరాకరించారో వారు ఈ యదార్థాలకు విముఖులయి ఉన్నారు. వారు ఈ విషయంలో నిశ్చింతగా ఉన్నారు, తమ ఆచరణలకు జవాబు చెప్పుకోవలసిన దినం ఒకటి రానున్నదన్న ఆలోచనే వారికి లేదు. ఈ యదార్థాలను గురించి యెరుక పరచి దైవసందేశహరుడు తమ ఎడల ఏదో హాని కలగజేశాడని వారు భావిస్తున్నారు. నిజానికి ఇది వారి ఎడల ఆయన చేసిన గొప్ప మేలు. విచారణ, జవాబు చెప్పుకోవలసిన సమయం రాక పూర్వమే ఆ సమయం రానున్నదని తెలుపడమేకాక ఆ సమయంలో ఏ ఏ విషయాలను గురించి విచారణ జరుగుతుందో అది కూడా తెలిపాడు – తద్వారా వారు దానికి తగినట్టుగా సన్నద్ధులవడానికి.

ముందు వస్తున్న ప్రసంగాన్ని అర్థం చేసుకునేందుకు ఒక విషయం దృష్టిలో ఉండవలసి ఉంటుంది. మానవుడు చేసే అన్నింటికన్నా పెద్ద తప్పు దైవం విషయంలో తన విశ్వాసాన్ని నిర్ణయించుకోవడంలో చేసేదే. ఈ విషయాన్ని చాలా తేలికగా తీసుకుని లోతుగా ఆలోచించడానికి, పరిశోధించడానికి ఎటువంటి కృషి చేయకుండా స్థూలంగా లేదా ఏదో విన్నదాని రీత్యా విశ్వాసం ఏర్పరచుకోవడం మహా అవివేకం. ఇది ప్రాపంచిక జీవితంలో మానవుని పూర్తి వైఖరిని, అనంతకాలం వరకు అతని అంతిమ పరిణామాన్ని చెరిపివేస్తుంది. కాని మనిషి ఏ కారణం వల్ల ఇలా తేలికగా ఈ విషయాన్ని తీసుకుంటాడో అది తన్ను తాను బాధ్యతా రహితునిగా భావించుకోవడం వల్లనే. ఫలితంగా ఓ అపోహకు గురవుతాడు. దైవం విషయంలో ఏ విశ్వాసాన్ని అవలంబించినా ఎటువంటి వ్యత్యాసం ఏర్పడదు, మరణానంతరం అసలు ఎటువంటి జీవితమే లేదు, అందులో నేను జవాబు చెప్పుకోవలసిన పనీ లేదు. ఒకవేళ అక్కడ జవాబు చెప్పుకోవలసి వచ్చినా నేనెవరినయితే ఆశ్రయించి ఎవరెవరినయితే పట్టుకుని ఉన్నానో వారు నన్ను చెడు ఫలితం నుండి కాపాడుకుంటారు. ఈ బాధ్యతా భావన లేమివల్లనే మనిషి మతపరమయిన విశ్వాసాన్ని ఎన్నుకోవడంలో గంభీరంగా ఆలోచించడు. ఈ కారణంగానే అతను ఎంతో నిశ్చింతతో నాస్తికత్వం మొదలుకుని బహుదైవారాధన లోని అత్యంత అసమంజసమయిన విధానాల వరకు రకరకాల నమ్మకాలు స్వయంగా కల్పించుకుంటాడు, లేదా ఇతరులు కల్పించిన వాటిని స్వీకరిస్తాడు.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (6వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ الْمَغَازِي

## 4. యుద్ధాల ప్రకరణం -2
(కితాబుల్ మగాజీ)

## తబూక్ యుద్ధం గురించి

**274)** మహనీయ అబూ మూసా అష్అరీ (రజి) కథనం: నా స్నేహితులు కొందరు నన్ను దైవప్రవక్త(స) సన్నిధికి పంపించి, వాహనాలుగా కొన్ని పశువుల (ఒంటెల) కోసం అభ్యర్థించమని కోరారు. వారంతా ఆయన (స)తో కలసి ఇక్కట్ల యుద్ధం (తబూక్ యుద్ధం)లో పాల్గొనాలని కోరుకున్నారు. నేను వెళ్ళి, 'దైవప్రవక్తా! నా స్నేహితులు నన్ను మీ దగ్గరకు పంపించారు. తమరు ఎలాగైనా సరే వారి కొరకు వాహనాలను (ఒంటెలను) సమకూర్చండి' అని విన్నవించుకున్నాను. దానికి ఆయన(స), "దైవసాక్షిగా! నేను నీకు వాహనాలను సమకూర్చలేను" అని నిర్ద్వంద్వంగా చెప్పేశారు. నేను ఆయన(స) సన్నిధిలో హాజరైన సమయంలో ఆయన(స) కోపావేశంలో ఉన్నారు. ఈ విషయాన్ని నేను పసిగట్టలేక పోయాను. ఆయన(స) నిరాకరించడంతో నేను తీవ్ర దుఃఖానికి లోనై తిరిగి వచ్చేశాను. బహుశా నేను వాహనాలను ఇవ్వమని అడిగిన కారణంగా ఆయన(స) ఆగ్రహం చెందారేమోనన్న శంక నన్ను కలచివేసింది.[1] నేను నా స్నేహితుల దగ్గరకు వచ్చి దైవప్రవక్త(స) చెప్పిన మాటను వారికి వినిపించాను. కాని ఇలా చెప్పిన కొద్ది సమయానికే నేను బిలాల్(రజి) పిలుపును విన్నాను– 'ఓ అబ్దుల్లాహ్ బిన్ ఖైస్!' అని ఆయన కేకేసి పిలుస్తున్నారు. నేను ఆయన పిలుపుకు స్పందించగానే 'దైవ ప్రవక్త(స) మిమ్మల్ని రమ్మంటున్నార'ని అన్నారు. నేను దైవప్రవక్త(స) సన్నిధిలో హాజరవగానే, "ఇదిగో ఈ రెండు జతలు. ఇవిగో, వీటిని కూడా తోలుకుని వెళ్ళు" అన్నారు. ఆ విధంగా ఆయన(స) మొత్తం ఆరు ఒంటెల్ని మాకు సమకూర్చారు. ఆ ఒంటెల్ని ఆయన(స) అప్పుడే సాద్ (రజి) నుండి కొనుగోలు చేశారు. ఇంకా ఇలా వక్కాణించారు: "వీటిని నీ స్నేహితులకు ఇవ్వు. దైవం లేక దైవప్రవక్త మీకు వాహనాలుగా వీటిని సమకూర్చారు. వీటిపై స్వారీ అవండి అని వారికి చెప్పు"–

నేను ఆ ఒంటెల్ని తోలుకుని నా సహవాసుల వద్దకు వెళ్ళాను. ఇదిగో దైవప్రవక్త మీకు వాహనాలుగా ఈ ఒంటెల్ని ఇచ్చారు. అయితే దైవసాక్షిగా! మొదట దైవప్రవక్త(స) నిరాకరించిన వైనాన్ని విన్న సహచరమాన్యుల వద్దకు మీరు రావలసి ఉంటుంది. ఎందుకంటే దైవప్రవక్త(స) నాతో మొదట చెప్పిన మాటను నేను వక్రీకరించి ఉంటానన్న అనుమానం మీకు రావచ్చు'[2] అని చెప్పాను. దానికి వారు, 'అయ్యో! మీ సత్యనిబద్ధత పట్ల మాకు ఎలాంటి అనుమానం లేదు. కాని ఒకవేళ మీరు అంతగా పట్టుబడితే, మేము అలాగే వస్తాము' అన్నారు.

అబూ మూసా(రజి) వారిలో నుండి కొంతమందిని తీసుకుని దైవప్రవక్త(స) పలుకుల్ని విన్న సహచరుల వద్దకు వచ్చారు– అంటే దైవప్రవక్త(స) మొదట్లో వాహనాలను సమకూర్చడానికి నిరాకరించి, ఆ తర్వాత ఒంటెల్ని ఇచ్చిన సంగతిని వారి చేత ధ్రువీకరించుకోవాలనుకున్నారు. ఆ సహచరమాన్యులు(రజి) కూడా ఈ విషయాన్ని నిజమని ధ్రువపరిచారు.

74-1. అబూ మూసా అష్అరీ(రజి) దుఃఖానికి అసలు కారణం వాహనాలు లభించకపోవటం కాదు. తన అభ్యర్థన కారణంగా దైవప్రవక్త(స) మనస్సు నొచ్చుకుందేమోనన్నదే ఆయన బాధ. సుబ్‌హానల్లాహ్. ప్రవక్త సహచరమాన్యుల ప్రేమాభిమానం, త్యాగ శీలం గురించి ఏమని చెప్పేది!

274-2. తన సహవాసులు తనను అబద్ధీకుడు అనుకుంటారేమోనన్న అనుమానం అబూ మూసా(రజి)ను పీడించింది. తాను వారితో అబద్ధం చెప్పలేదన్న దానికి సాక్ష్యాధారాలు సమర్పించి, తాను సచ్ఛీలుడనని నిరూపించుకోవాలనుకున్నారు.



# పేదరికం తగ్గితే 80 కోట్ల మందికి రేషన్ ఎందుకు?

అర్షియా

**ప్రపంచ బ్యాంకు** ప్రకారం 2011-12 నుండి 2022-23 మధ్య కాలంలో నిరుపేదలు తమ పేదరికం నుండి బయట పడటంలో భారత్ విశేష విజయాన్ని సాధించింది. పేదరికం, అసమానతలపై రూపొందించిన నివేదికలో, గత దశాబ్దంలో పేదరికాన్ని భారత్ చాలా వరకు తగ్గించిందని ప్రపంచ బ్యాంక్ పేర్కొంది. రోజుకు 2.15 డాలర్ల కన్నా తక్కువ ఆదాయంతో జీవించే అత్యంత పేద ప్రజల శాతం 2011-12లో 16.2 శాతం ఉండగా, 2023-24 నాటికి అది 2.3 శాతానికి తగ్గింది. దీని ప్రకారం, 17.1 కోట్ల మంది దారిద్ర్య రేఖను దాటి పైకి వచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో అత్యంత పేదరికం 18.4 శాతం నుండి 2.8% శాతానికి, పట్టణాల్లో 10.7 శాతం నుండి 1.1 శాతానికి తగ్గింది. దీనివల్ల గ్రామీణ-పట్టణ ప్రాంతాల్లో పేదరిక వ్యత్యాసం 7.7 శాతం నుండి 1.7 శాతానికి తగ్గింది. ఇది నిజంగా ఆశాజనక పరిణామం.

భారత్ ఇప్పుడు "దిగువ మధ్య తరగతి ఆదాయ దేశాల" జాబితాలోకి ప్రవేశించింది. ఈ వర్గంలో రోజుకు 3.65 డాలర్ల ఆదాయాన్ని పేదరిక రేఖగా పరిగణిస్తారు. దీని ప్రకారం భారత్‌లో పేదరికం 61.8 శాతం నుండి 28.6 శాతానికి తగ్గింది. అంటే 37.8 కోట్ల మంది పేదరికం నుండి బయటపడ్డారు. గ్రామీణ పేదరికం 69 శాతం నుండి 32.5 శాతానికి, పట్టణ పేదరికం 43.5 శాతం నుండి 17.2 శాతానికి తగ్గింది. గ్రామీణ-పట్టణ వ్యత్యాసం 25 శాతం నుండి 15 శాతానికి తగ్గింది. పేదరిక సగటు వార్షిక తగ్గుదల 7శాతంగా ఉంది. 2021-22లో ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో పేదలు ఎక్కువగా ఉన్నారు. మొత్తం అత్యంత పేదలలో 62 శాతం మంది ఈ రాష్ట్రాల్లోనే ఉన్నారు. 2022-23 నాటికి ఈ రాష్ట్రాల్లో పేదరికం తగ్గినప్పటికీ, పేదల శాతంలో ఈ రాష్ట్రాల భాగస్వామ్యం ఇంకా మూడింట రెండు వంతులుగా ఉంది.

మన దేశంలో ఎనిమిది రాష్ట్రాల్లో పేదరికం ఎంతగా ఉందంటే - కొన్ని అత్యంత పేద దేశాల్లోనూ పేదరికం ఇంత ఉండదు. భారత్‌తో పాటే స్వాతంత్ర్యం పొందిన పేద దేశాల్లోనూ ఇంత పేదరికం లేదు. భారతదేశంలో లక్షలాది మంది రోజుకు రూ.150 లేదా అంతకంటే తక్కువ సంపాదన మీద ఆధారపడుతున్నారు. వారిలో 30% మంది రోజుకు రూ.50 మాత్రమే సంపాదిస్తున్నారు. Poverty India Index ప్రకారం,2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారాలని భారత్ ప్రయత్నిస్తున్నది. కాని వాస్తవంలో పేదల సంఖ్య పెరుగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో పేదరికం ఎలా తగ్గాలి? ప్రభుత్వం అందుకు ఏమి చేయాలి? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

21వ శతాబ్దంలో కూడా ఏటా భారతావనిలో 7000 మంది కంటే ఎక్కువే ఐదేళ్ల లోపు పిల్లలు పోషకాహార లోపంతో మృతి చెందుతున్నారు. వాస్తవానికి దేశం ఇంకా "లోయర్ మిడిల్ ఇన్‌కమ్ క్లాస్"లో కూడా అత్యంత పేద స్థితిలో ఉంది. గ్లోబల్ హంగర్ ఇండెక్స్ 2024 ప్రకారం, భారత్ 127 దేశాల జాబితాలో 105వ స్థానంలో ఉంది- అంటే శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్ కంటే కూడా వెనుకబడి ఉంది. భారత్ GHI స్కోర్ 7.3. ఇది అత్యంత ప్రమాద కరంగా ఉంది. దేశంలో లక్షలాది మంది పిల్లలు ఇంకా పోషకా హారానికి నోచుకోవడం లేదు. మన పిల్లల్లో పోషకాహార లోపం పెద్ద సమస్యగా మారింది.

దేశంలో 18 కోట్ల మంది ఇంకా మురికి వాడల్లోనే నివసిస్తున్నారు. దేశాభివృద్ధిపై భారీ హంగామా చేస్తున్నప్పటికీ, మెట్రో నగరాల్లో

పేదల బస్తీల విస్తృతి స్పష్టంగా కనిపిస్తోంది. ప్రపంచంలో ఏ దేశంలోనైనా పేదరికం ఉంటుంది. అయితే మనం మన దేశాన్ని పక్కనున్న దేశాలతో పోల్చలేము. ఇండియాలో పల్లె, పట్టణాల్లో అడుగడుగునా పలువురు భిక్షాటన చేసే దృశ్యాలు కనిపిస్తాయి.

డిజిటల్ ఇండియా అంటూ ప్రభుత్వం ఊదరగొడుతున్నా, దేశంలో 20 శాతం మందికి బ్యాంక్ ఖాతాలు లేవు. బ్యాంక్ ఖాతా ఉంటే తక్కువ వడ్డీతో లోన్ తీసుకొని జీవితాన్ని మెరుగుపర్చవచ్చు. ఉదాహరణకు, ఒక యువకుడు 12వ తరగతి వరకు చదివి హోటల్లో పనిచేస్తూ నెలకు రూ.18,000 సంపాదిస్తున్నాడు అనుకుందాం. ఆ యువకుడు ఇంగ్లీష్ కోర్సు చేసి కాల్ సెంటర్‌లో చేరితే అతని ఆదాయం పెరగవచ్చు. కానీ పేదలకు అలాంటి కోర్సులకు అవసరమైన ఆ రెండు మూడు వేల రూపాయలు సంపాదించడమూ కష్టమే. అందుకే మంచి పాలసీ మేకింగ్, మైక్రో ఫైనాన్స్ అవసరం.

పేదరికం అనేది బహుళ కారణాల (Multidimensional) సమస్య. ఇది చారిత్రక, ఆర్థిక, రాజకీయ అంశాల ఫలితం. నోబెల్ అవార్డు గ్రహీత అమర్త్యసేన్ పేదరిక నిర్మూలన కోసం విద్య, ఆరోగ్య రంగాల్లో పెట్టుబడి పెట్టాలని సూచించారు.

Multidimensional Poverty Report 2023 ప్రకారం, ప్రపంచంలోని మూడవ వంతు పేదలు దక్షిణ ఆసియాలో ఉన్నారు. అందులో 70 శాతం మంది భారతదేశానికి చెందినవారే. ప్రపంచ బ్యాంకు నిర్దేశించిన దారిద్ర్య రేఖ కొలమానాల ప్రకారం:

– రోజుకు $2.15 కంటే తక్కువ ఆదాయంతో జీవిస్తే “అత్యంత పేదలు”గా పరిగణించాలి.

– రోజుకు $3.65 కంటే తక్కువ ఆదాయంతో బతికితే “లోయర్ మిడిల్ ఇన్‌కమ్ క్లాస్”గా భావించాలి.

– రోజుకు $6.85 ఆదాయంతో బతికితే “అప్పర్ మిడిల్ ఇన్‌కమ్ క్లాస్” గా గుర్తించాలి.

Global Multidimensional Poverty Index (MPI) 2020 ప్రకారం, 107 దేశాల జాబితాలో భారత్ 62వ స్థానంలో ఉంది. భారత్ MPI స్కోర్ 0.123. భారత జనాభాలో 27.9 శాతం MPIలోకి వస్తున్నారు. అనేక డేటాల ప్రకారం, దేశం పేదరికం నుంచి బయటపడుతున్నట్టు తేలుతోంది. కానీ నిజంగా ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారా అనేది పెద్ద ప్రశ్నగా మిగిలింది. మోదీ ప్రభుత్వం పేదరికం తగ్గిందన్న గణాంకాలను గొప్పగా ప్రచారం చేసుకుంటోంది. కానీ ఈ ప్రచారం వల్ల పేదలకు ఏమైనా ప్రయోజనం ఉందా అనేది మనమంతా ఆలోచించాలి.

అన్ని గణాంకాలు నిజమైతే వాటిలో సారూప్యత ఎందుకు లేదు? మన దేశంలో పేదరిక స్థాయిని “ఖర్చు సూచిక” ఆధారంగా కేంద్ర ప్రభుత్వం కొలుస్తుంది. NSSO ఈ డేటాను సేకరిస్తుంది. 2009లో టెండూల్కర్ కమిటీ ప్రకారం, గ్రామీణ ప్రాంతాల్లో నెలకు 447, పట్టణాల్లో 579 లోపు సంపాదించేవారు దారిద్ర్యరేఖ క్రింద జీవిస్తున్నట్టు భావించాం. అయితే ఈ కొలమానం చాలా తక్కువ. 2012లో రంగరాజన్ కమిటీ నిర్దేశించిన కొత్త ప్రమాణాల ప్రకారం గ్రామాల్లో రోజుకు 32, పట్టణాల్లో రోజుకు 47 లోపు సంపాదించేవారిని పేదలుగా భావించాలి.

2022-23, 2023-24లో పేదరికంపై వచ్చిన సర్వేలు తేడాలు చూపించాయి. 2011-12లో దేశంలో 25 కోట్ల మంది అత్యంత పేదలు కాగా, 2022-23లో అత్యంత పేదల సంఖ్య 22.5 కోట్లకు తగ్గింది. 2011-12లో పైన పేర్కొన్న 5 రాష్ట్రాల్లో అత్యంత పేదల సంఖ్య 65శాతం కాగా, 2021-22లో అది 54శాతానికి తగ్గింది.

కేవలం ఖర్చు ఆధారంగా పేదరికాన్ని అంచనా వేయడం సరైనది కాదని ప్రముఖ ఆర్థిక వేత్తలు చెప్తున్నారు. ఎందుకంటే పేదరికం అనేది బహుళ అంశాల సమస్య. పేదలకు తగినంత పోషకాహారం ఉండకపోవచ్చు, కనీస వైద్య సౌకర్యాలు లేకపోవచ్చు. ఒకవేళ వారికి ఇల్లు ఉండొచ్చు.. కానీ పిల్లల చదువుకు డబ్బు లేకపోవచ్చు. ఇలా విద్య, ఆరోగ్యం, నీరు, విద్యుత్, రవాణా – అన్ని అంశాలను కలిపే పేదరికాన్ని కొలవాలి. ఒకవేళ దేశంలో పేదరికం నిజంగా తగ్గిందంటే, ఎందుకు 30 శాతం కుటుంబాలు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై ఆధారపడి జీవిస్తున్నాయి? ఎందుకు 80 కోట్ల మంది ప్రజలకు స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏండ్ల తర్వాత కూడా ఉచిత రేషన్ అవసరమవుతోంది? పేదల లెక్కింపులో గుణాత్మక డేటా లేకపోవడం వల్ల అసమానతల అంచనా అస్థిరంగా ఉంది.

ప్రపంచ బ్యాంకు ప్రకారం Gini Index 2022-23లో 25.5 స్కోర్ ఉంటే పేదరికం తగ్గినట్టు. కానీ World Inequality Data base 2023 ప్రకారం ఇది 62గా ఉంది. అంటే దేశంలో ఆర్థిక అసమానతలు పెరిగినట్లే కదా! దేశంలోని టాప్ 1 శాతం ధనికుల చేతిలో దేశం మొత్తం సంపదలో 40 శాతం ఉంది. కొవిడ్ సమయంలో ముకేశ్ అంబానీ రోజుకు 90 కోట్లు సంపాదించారు. కానీ దేశంలో సగం జనాభా వద్ద 3 లక్షల లోపు ఆస్తులే ఉన్నాయి. ఒకసారి సామాన్యులు ఆసుపత్రిలో చేరి భారీగా బిల్లు చెల్లించాల్సి వస్తే, వారు వెంటనే దారిద్ర్య రేఖ దిగువకు వెళ్లిపోతున్నారు.

ఏప్రిల్ 26న వారణాసిలో 150 మంది డెలివరీ వర్కర్లు సమ్మె చేశారు. వారు వేసవి దుస్తులు, విశ్రాంతి సమయంలో బెంచ్, తాగునీరు, 12 నుండి 4 వరకు బ్రేక్ వంటి డిమాండ్లు చేశారు. కానీ కంపెనీ వారి ఐడీలు రద్దు చేసి తొలగించింది.

ఈ సంవత్సరం కేంద్ర బడ్జెట్‌లో గిగ్ వర్కర్లకు ID కార్డులు ఇస్తామన్నారు. రిజిస్ట్రేషన్ ద్వారా వారి హక్కులు కాపాడాలి. ఇటీవలే కార్మికుల దినోత్సవం జరుపుకున్నాం– 1886లో కార్మికులు 8 గంటల పని, 8 గంటల విశ్రాంతి, 8 గంటల స్వేచ్ఛ అని డిమాండ్ చేసి దాన్ని సాధించారు. కానీ ఇప్పుడు వారు 12-14 గంటలు పని చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.




- సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ

## ఔలియా అల్లాహ్ ఎవరు?

వినండి! అల్లాహ్ స్నేహితుల (ఔలియా అల్లాహ్)కు "భయముగానీ, దుఃఖంగానీ ఉండదు. వారు విశ్వసించిన వారై, (చెడుల విషయంలో అల్లాహ్‌కు) భయపడేవారై ఉంటారు.. వారిటు ప్రపంచంలో, అటు పరలోకంలోనూ సంతోషంగా ఉంటారు. అల్లాహ్ మాటలు ఎన్నటికీ మారవు. ఇదే గొప్ప సాఫల్యం. (యూనుస్: 62-65)

వలీ అనే పదం, పవిత్ర ఖురాన్‌లో వివిధ క్రియా రూపాల్లో, క్రియా నామవాచక రూపాల్లో, యాక్టివ్ పార్టిసిపుల్, పాసివ్ పార్టిసిపుల్ రూపాల్లో ప్రస్తావించబడింది. వలీ అనే పదం పవిత్ర ఖురాన్‌లో రెండు వందల ముప్పై మూడుసార్లు (దాని వివిధ రూపాల్లో పునరావృతమైంది.

'ఔలియా' అనే పదం 'వలీ' అనే పదానికి బహువచనం. అరబీ నిఘంటువులో 'వలీ' అర్థం. మిత్రుడు, సహాయకుడు. మార్గదర్శకుడు, కాపాడువాడు అనే అర్థాలూ గలవు. ఔలియా అల్లాహ్ అనగా అల్లాహ్ మిత్రులు. అల్లాహ్‌ను సంతుష్టం చేసుకున్నవారు. ఔలియా పట్ల అల్లాహ్ కూడా సంతుష్టుడౌతాడు. ఇవే కాకుండా వేరే అర్థాల్లో కూడా వలీ అన్న పదం ఖురాన్‌లో వచ్చింది:

వలీ- అంటే మద్దతుదారుడు, మిత్రుడు, వలీ- అంటే ప్రభువు, పూజించబడేవాడు. వలీ- అంటే కుమారుడు, వలీ-అంటే సహచరుడు, వలీ- అంటే విగ్రహం, ప్రతిమ. వలీ- అంటే దగ్గరి బంధువు. వలీ- అంటే వారసుడు, వారసత్వంలో సజాతీయుడు.

♦ విశ్వాసులు అల్లాహ్ మార్గంలో పోరాడుతారు. అవిశ్వాసులు షైతాన్ మార్గంలో పోరాడుతారు. కనుక మీరు (దైవమార్గంలో) షైతాన్ అనుచర మూకతో పోరాడండి. షైతాన్ పన్నే కుటిల పన్నాగాలన్నీ చాలా బలహీనమైనవని తెలుసుకోండి. (అన్-నిసా: 76)

♦ విశ్వసించినవారికి అల్లాహ్‌యే సహాయకుడు, సంరక్షకుడు. ఆయన వారిని చీకటి నుండి తీసి వెలుగులోకి ప్రవేశపెడ్తాడు. సత్యాన్ని తిరస్కరించేవారికి పైశాచిక శక్తులే నేస్తాలు. వారిని ఈ పిశాచ శక్తులు వెలుగు నుండి తీసి చీకటిలోకి తీసుకెళ్తాయి. వారే నరక వాసులు. నరకంలోనే వారు ఎల్లకాలం పడివుంటారు. (అల్-బఖరహ్: 257)

## ఇస్లామీయ పరిభాషలో "ఔలియా అల్లాహ్" అర్థం:

"చిత్తశుద్ధితో అల్లాహ్‌కు, ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వ సల్లం) వారికి విధేయత కనబరచి, చెడుల నుండి తమను కాపాడుకొని అల్లాహ్ సామీప్యం పొందేందుకు నిరంతరం పాటుపడినవారు."

అల్లాహ్ స్వయంగా 'ఔలియా అల్లాహ్'ను నిర్వచించాడు. వారు విశ్వసించిన వారై, (చెడుల విషయంలో అల్లాహ్‌కు) భయపడేవారై ఉంటారు. (యూనుస్: 63)

దీన్నిబట్టి అవగతమయ్యే దేమిటంటే దైవసామీప్యం పొందగోరేవారు నిష్కల్మషమైన విశ్వాసం కలిగి ఉండటంతో పాటు, భయభక్తులతో

కూడుకున్న జీవితం గడపాలి. ప్రతి దైవభీతిపరుడూ అల్లాహ్‌కు ప్రియతముడే (వలీ అల్లాహ్‌యే). కాని జనులు మాత్రం దీన్ని ఒక ప్రహసనంగా మార్చారు. మహిమలు చూపేవారే అల్లాహ్ 'ప్రియతములు' కాగలుగుతారని భాష్యం చెప్పారు. తమ భాష్యాన్ని సమర్థించుకోవటానికి, తాము ఇష్టపడే 'వలీల'కు స్వకల్పిత మహిమలను ఆపాదించారు. అల్లాహ్ సామీప్యం పొందటానికీ – మహిమలు ప్రదర్శించటానికి అసలు సంబంధమే లేదు. ఒకవేళ ఎవరి ద్వారానయినా ఏదైనా మహిమ ప్రదర్శితమైతే అది దైవేచ్ఛ, దైవప్రణాళిక అనుకోవాలి. అంతేగాని, అది ఆ వలీ తరఫు నుంచి జరిగింది ఏమీ కాదు. అలాగే ఒక ధర్మ నిష్ఠాపరుని ద్వారా, ఒక విశ్వాసి ద్వారా ఏదన్నా మహిమ ప్రదర్శితం కాకపోయినంత మాత్రాన వారి భక్తితత్పరతను శంకించనవసరం లేదు. ఎవరి అంతర్యాల్లో ఎంత భక్తి ఉందో అల్లాహ్‌కే బాగా తెలుసు.

## రహ్మతుల్లాహి అలైహ్

ఔలియా పేర్ల ప్రక్కనే కాదు మరణించిన ప్రతి ముస్లిం పేరు ప్రస్తావన అనంతరం– కీర్తిశేషులు అన్న వ్యవహారిక పదంలానే– రహ్మతుల్లాహి అలైహి" అని వ్రాయడం ఆనవాయితీ. అనగా "అల్లాహ్ శుభాశిస్సులు, కృపానుగ్రహాలు అతనిపై సదా ఉండుగాక! ఉదాహరణకు– అహ్మద్ బతికున్నాడనుకోండి= అతని పేరు ప్రస్తావించగా తర్వాత హాఫీజహుల్లాహ్– అల్లాహ్ ఆయన్ను రక్షించుగాక! అని అంటాము. అదే అహ్మద్ మరణిస్తే– (రహిమహుల్లాహ్– రహ్మతుల్లాహి అలైహ్) అంటే అల్లాహ్ ఆయన్ను కరుణించుగాక! అని దీవించడం పరిపాటి.

## ఔలియా అల్లాహ్ గుణాలు

అల్లాహ్ ఇలా తెలియజేసాడు: "వినండి! అల్లాహ్ స్నేహితులకు భయముగాని, దుఃఖంగానీ ఉండదు–వారు విశ్వసించినవారై (చెడుల విషయంలో) అల్లాహ్‌కు భయపడేవారై ఉంటారు" (యూనుస్: 62–63)

♦ అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : "వల్లాహు వలియ్యుల్ ముత్తఖీన్" (అల్లాహ్ దైవభీతి కలవారికి సన్నిహితుడు) (జాసియా:19)

'భయము' భవిష్యత్తుకూ, 'దుఃఖం' గతానికీ సంబంధించినది. వారు అల్లాహ్‌కు భయపడుతూ జీవితం గడపటం వల్ల ప్రళయ దినపు భీతావహ స్థితి గురించి అంతగా భయపడవలసిన అవసరం ఉండదు. పైగా వారు తమ విశ్వాసం (ఈమాన్), భయభక్తుల (తఖ్వా) మూలంగా అల్లాహ్ కారుణ్యం పట్ల ఆశపెట్టుకుని ఉంటారు. దైవానుగ్రహం తమపై ఉంటుందన్న భరోసా వారికి ఉంటుంది. అలాగే ఇహలోకంలో తాము వదలిపోయిన దాని గురించిగానీ, తాము జుర్రుకోలేకపోయిన సుఖాల పట్ల గానీ వారికి ఎలాంటి చీకూ చింతా ఉండదు. ఎందుకంటే ఇదంతా దైవేచ్ఛకనుగుణంగా జరిగిందన్న సంగతి వారికి బాగా తెలుసు. అందువల్ల వారి ఆంతర్యాలలో ఎలాంటి అసంతృప్తి, వ్యాకులత ఉండదు. పైగా దైవేచ్ఛ పట్ల వారి హృదయాలు పూర్తిగా రాజీపడిపోతాయి. ప్రపంచంలో శుభవార్త అంటే సత్య కలలు లేక మరణ సమయంలో దైవదూతలు వారికి అందజేసే శుభవార్త కావచ్చు. ఖుర్‌ఆన్ హదీసుల ద్వారా ఈ సంగతి రూఢీ అవుతోంది.

♦ మరొక చోట అల్లాహ్ ఇలా తెలియజేసాడు: "ఎవరయితే అల్లాహ్‌కు, ప్రవక్తకు విధేయత కనబరుస్తారో వారే అల్లాహ్ అనుగ్రహం పొందిన ప్రవక్తలతోనూ, సత్యసంధులతోనూ, షహీదులతోనూ ఉంటారు. వీరు ఎంతో మంచి స్నేహితులు" (నిసా:69)

## వలియుల్లాహ్ అవ్వాలంటే ఏం చేయాలి?

**మొదటి షరతు :** సర్వశక్తిమంతుడైన అల్లాహ్ వలీ యొక్క షరతులలో ప్రథమమైనది– అల్లాహ్, ఆయన దూతల, ఆయన గ్రంథాలకు, అంతిమ దినం పట్ల శంకకు తావు లేని విధంగా విశ్వాసం కలిగి ఉండాలి. ఖుర్‌ఆన్. అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను మనస్ఫూర్తిగా విశ్వసించి, ఇకదానిపై ఎలాంటి అనుమానానికి ఆస్కారమివ్వకుండా అల్లాహ్ మార్గంలో ధన ప్రాణాలొడ్డి పోరాడేవారే నిజమైన విశ్వాసులు. వారే సత్యవంతులు. (అల్–హుజురాత్: 15)

మీరు మీ ముఖాలు తూర్పు లేక పడమరకు తిప్పుకోవడమే పుణ్యకార్యం కాదు. అల్లాహ్‌ను, అంతిమదినాన్ని, దైవదూతలను, దేవుడు పంపిన (అంతిమ) గ్రంథాన్ని, ఆయన ప్రవక్తలను హృదయపూర్వకంగా విశ్వసించి, అల్లాహ్ మీది ప్రేమాభిమానాలతో మీకత్యంత ప్రియమైన ధనాన్ని బంధువుల కోసం, అనాథల కోసం, నిరుపేదల కోసం, బాటసారుల కోసం, సహాయార్థుల కోసం, బానిసల విముక్తి కోసం ఖర్చు చేయాలి. ప్రార్థనా వ్యవస్థ నెలకొల్పాలి జకాత్ చెల్లించాలి. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. కష్టకాలంలో, (సత్యా సత్యాల మధ్య జరిగే) పోరాటంలో సహనం వహించాలి. ఇలాంటి సత్కార్యాలు చేసే వారే సత్యసంధులు. వారే (దేవునిపట్ల) భయభక్తులు కలిగినవారు. (అల్ బఖరహ్: 177)

**రెండవ షరతు దైవప్రవక్త ముహమ్మద్(స) అనుసరణ:** ఓ ప్రవక్తా! వారికిలా చెప్పు: "మీరు నిజంగా అల్లాహ్‌ను ప్రేమిస్తుంటే నన్ను అనుసరించండి. అప్పుడు అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు, మీ పాపాలు క్షమిస్తాడు. అల్లాహ్ ఎంతో క్షమించేవాడు, కరుణించే వాడు." (ఆలి ఇమ్రాన్: 31).

ఇమామ్ ఇబ్న్ తైమియా (రహ్మ) ఇలా అన్నారు: "అల్లాహ్ పై ఆయతులో స్పష్టంగా చెప్పాడు, ఎవరైతే ప్రవక్తను అనుసరిస్తారో,

అల్లాహ్ అతన్ని ప్రేమిస్తాడు. అల్లాహ్‌ను ప్రేమిస్తున్నానని చెప్పుకుంటూ దైవప్రవక్తను అనుసరించనివాడు ఆయన స్నేహితులలో చేరలేడు. చాలా మంది తమ గురించి లేదా ఇతరుల గురించి వారు అల్లాహ్ స్నేహితులు అని భావిస్తున్నప్పటికీ, వారి క్రియా జీవితం రీత్యా వారు అల్లాహ్ స్నేహితులు కారు.

మరో సందర్భంలో ఇబ్న్ తైమియా ఇలా అన్నారు: "దైవ ప్రవక్తను మరియు ఆయన తీసుకువచ్చిన వాటిని విశ్వసించి, ఆయనను అంతర్గతంగా, బాహ్యంగా అనుసరించేవాడు తప్ప మరెవరూ అల్లాహ్ స్నేహితుడు కాలేడు. అల్లాహ్‌ను ప్రేమిస్తున్నానని, ఆయన స్నేహితుడిని అని చెప్పుకుంటూ, ఆయనను అనుసరించనివాడు అల్లాహ్ స్నేహితులలో ఒకడు కాదు. దీనికి భిన్నంగా ఆయనను వ్యతిరేకించేవాడు అల్లాహ్ శత్రువులలో ఒకడు, షైతాన్ స్నేహితుడు." – ఖుర్ఆన్ లో ఇలా ఉంది:

"ఎవరు అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకు విధేయత చూపుతారో అల్లాహ్‌కు భయపడుతూ ఆయన (శిక్షల) నుండి తమను కాపాడుకుంటారో వారే విజయం సాధించేవారు" (నూర్:52)

**మూడవ షరతు: అల్లాహ్ యెడల నిజమైన భయం, భక్తి:** ప్రతిష్ఠాలయానికి న్యాయసమ్మతమైన ధర్మకర్తలు దైవభీతి పరాయణులే – తఖ్వాపరులే అవుతారు. కాని చాలామంది ఈ విషయాన్ని ఎరుగరు. (అల్లాహ్‌ను నమ్మని, తఖ్వా లేని వారు) ప్రార్థనాలయంలో ఈలలు వేయడం, చప్పట్లు కొట్టడం మినహా వారు చేసే ప్రార్థన మరేముంది? కనుక మీ సత్యతిరస్కారానికి ప్రతిఫలంగా (మా)శిక్ష చవిచూడండి. (అల్–అన్ఫాల్: 34–35)

♦ అయితే మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే అల్లాహ్ దృష్టిలో ఎక్కువ గౌరవనీయుడు. అల్లాహ్ సర్వజ్ఞాని, సమస్త విషయాలు తెలిసినవాడు. (అల్–హుజురాత్: 13)

ఎవరయినా వలియుల్లాహ్ అవ్వడానికి రెండు మూల సూత్రాలు న్నాయి. 1) ఈమాన్ 2) తఖ్వా. ముక్తసరిగా చెప్పుకోవాలంటే, హదీసె జిబ్రయీల్‌లో పేర్కొనబడిన మూడు ధర్మ శ్రేణులు. 1) ఇస్లాం. 2) ఈమాన్. 3) ఇహ్సాన్.

హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజియల్లాహు అన్హు) కథనం: "మేము ఒక రోజు దైవప్రవక్త సమక్షంలో కూర్చుని ఉన్నాము. ఇంతలో ఒక వ్యక్తి సమావేశంలోకి వచ్చాడు. అతని వస్త్రాలు తెల్లవిగాను, తల వెంట్రుకలు మిక్కిలి నల్లవిగాను ఉన్నాయి. అతనిపై ప్రయాణపు అలసట కనబడలేదు. పైగా మాలో ఎవరూ అతనిని ఎరుగరు కూడ. చివరికి అతను ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్దకు వచ్చి ఆయన మోకాళ్ళకు తన మోకాళ్ళు ఆనించి, తన చేతులు తొడలపై పెట్టుకొని కూర్చున్నాడు. ఇలా అడిగాడు. "ఓ ముహమ్మద్! (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇస్లాం గురించి తెలుపండి?" దానికి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: "ఇస్లాం అంటే నీవు అల్లాహ్ తప్ప మరే ఆరాధ్య దేవుడు లేడని, ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అల్లాహ్ ప్రవక్త అని సాక్ష్యమిస్తూ నమాజు స్థాపించాలి, 'జకాత్' (ధర్మదానం) చెల్లించాలి, పవిత్ర రమజాన్ మాసపు ఉపవాసాలు పాటించాలి, స్థోమత కల్గివున్నప్పుడు 'హజ్' చేసి పవిత్ర కాబా (అల్లాహ్ గృహాన్ని) దర్శించాలి". ఇది విన్న ఆ వ్యక్తి 'అవును మీరు చెప్పింది నిజమే..' అన్నాడు. అతని వాక్యాలకు మేము ఆశ్చర్యపోయాము. తనే ప్రశ్నిస్తున్నాడు. తనే ధ్రువీకరిస్తున్నాడు.

ఆ వ్యక్తి మరలా 'ఈమాన్ గురించి తెల్పండి?' అని ప్రశ్నించాడు. దానికి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: "నీవు అల్లాహ్‌ను ఆయన దూతలను, ఆయన గ్రంథాలను, ఆయన ప్రవక్తలను, ప్రళయ దినాన్ని మరియు విధిరాత (మేలైనా చెడైనా) ను విశ్వసించాలి". ఇది విన్న ఆ వ్యక్తి 'అవును మీరు చెప్పింది నిజమే..' అన్నాడు.

ఆ వ్యక్తి మరలా 'ఇహ్సాన్ గురించి తెల్పండి?' అని ప్రశ్నించాడు. దానికి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: "నీవు పరిపూర్ణ మనస్సుతో అల్లాహ్‌ను చూస్తున్నట్లుగా ఆరాధించు.. ఒకవేళ నీవు ఆయనను చూడక పోయినా ఆయన నిన్ను గమనిస్తున్నాడని గ్రహించు".

ఆ వ్యక్తి మరలా 'అయితే ప్రళయం గురించి (ఎప్పుడు వస్తుంది) తెల్పండి?' అని ప్రశ్నించాడు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అన్నారు: "( ప్రళయం ఎప్పుడు వస్తుందనేది) ప్రశ్నించబడే వారిని ప్రశ్నించే వానికంటే ఎక్కువ ఏమీ తెలియదు".

ఆ వ్యక్తి మరలా 'అయితే దాని చిహ్నాలను తెల్పండి?' అని అన్నాడు.. దానికి ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: "బానిసరాలు తన యజమానిని కంటుంది, చెప్పులు, వస్త్రాలు కూడా లేని (మేకల) కాపరులు పెద్ద పెద్ద భవనాలు నిర్మించి గర్వపడతారు".

హజ్రత్ ఉమర్ (రజియల్లాహు అన్హు) ఇలా చెప్పారు : (ఈ సంభాషణ తరువాత) ఆ వ్యక్తి వెళ్ళిపోయాడు. నేను కాసేపు (అక్కడే వున్నాను. అప్పుడు దైవప్రవక్త(స) నాతో ఇలా చెప్పారు:

ఓ ఉమర్..! ఆ పృచ్ఛకుడు ఎవరో తెలుసా..? 'అల్లాహ్, ఆయన ప్రవక్తకే బాగా తెలుసు' అని అన్నాను. అప్పుడు ప్రవక్త(సల్లల్లాహు అలైహి వసల్లం) "ఆయన 'జిబ్రయీల్' (దైవదూత), మీకు మీ ధర్మాన్ని బోధించటానికి మీ వద్దకు వచ్చారు" అని సెలవిచ్చారు. (ముస్లిం)

**(మిగతా వచ్చేవారం)**

# మంచి లక్షణాలు మనిషికి రక్షణ కవచాలు

**- పోలంకి విజయభాస్కర్**

**మానవజాతి** ఈ సమస్త సృష్టిలో మహోత్కృష్టమైనది. ఆలోచనా జ్ఞానం, విచక్షణ వంటి పలు విశిష్టతలతో మానవ మేథస్సు సృష్టించ బడింది. ఈ సృష్టిలో అద్భుతమైన శక్తి సంపదల సృష్టికి మానవ మేథస్సు నిలువెత్తు సాక్షీభూతం. కొన్ని జీవరాశులు మానవ జాతి కంటే బలమైనవి అయినా వాటికి బుద్ధిబలం, విచక్షణా శక్తి లేకపోవడం పెద్ద లోటు. అందుకే అన్ని విధాలా సకల జీవరాశులలో మానవుడే అత్యంత శక్తి సంపన్నుడు. అలాగే ఈ చరాచర జగత్తులో అత్యంత జ్ఞానవంతుడు కూడా మనిషే. ఒక విధంగా చెప్పాలంటే...మనసు కలిగినవాడు కాబట్టి మనిషి అని పేర్కొనవచ్చు. అటువంటి మనిషికి మంచి లక్షణాలే రక్షణ కవచాలుగా పనిచేస్తాయి.

ప్రతి మనిషి పది లక్షణాలను కలిగి ఉండాలి. అవి 1) ధైర్యం 2) ఓర్పు 3) మనస్సును నిగ్రహించుకోవటం 4) దొంగతనం చేయకపోవడం 5) శుచీ శుభ్రత 6) ఇంద్రియ నిగ్రహం 7) విద్యనార్జించటం 8) సత్యం పలకటం 9) ధనం సంపాదించటం 10) క్రోధము లేకుండుట మొదలైనవి మనిషికి ఉండవలసిన మంచి లక్షణాలు.

మంచి లక్షణమంటే ఏమిటి? అనే విషయానికి వస్తే...మనిషి తనకు తాను కష్టాలకు కృంగిపోకుండా సుఖాలలో పొంగిపోకుండా ధైర్యంగా ఉంటూ ఇతరులకు ధైర్యాన్ని నూరిపోయటం మంచి లక్షణం.

తనకు జన్మనిచ్చిన వారినే కాకుండా ఇతరుల తల్లిదండ్రులను గౌరవించడం, ఇతరుల అక్కాచెల్లెళ్లను,అన్నదమ్ములను తమ వారిగా భావించటం మంచి లక్షణం.

తన ఆపద సమయాల్లో ఓర్పు వహించటమే కాదు ఇతరుల ఆపద సమయాల్లో కూడా ఓర్పు వహించి వారికి అండగా నిలబడటం మంచి లక్షణం.

తాను పరుల సొమ్ముకు ఆశ పడకుండా, అక్రమంగా వారి సంపదను కాజేయకుండా ఉండటమే కాకుండా ఇతరులను కూడా దొంగతనాలు చేయకుండా చూడటమే మంచి లక్షణం.

తాను ఎలాంటి కల్మషం లేకుండా మంచి శుభ్రతను పాటిస్తూ ఇతరులకు మార్గదర్శకంగా ఉండటమే మంచి లక్షణం.

తాను జ్ఞానేంద్రియాలను, కర్మేంద్రియాలను అదుపులో పెట్టుకోవడం... భవిష్యత్ మనుగడ కోసం కష్టపడి విద్యను, ధనాన్ని ఆర్జించటం మంచి లక్షణం.

తాను సంపాదించిన ధనంలో అనాథలకు, అగత్యపరులకు కొంత దానం చేయడం మంచి లక్షణం.

సొంత లాభం కొంత మాని పొరుగువారికి తోడ్పడాలి. "పరోపకారార్థమిదం శరీరం" అని అన్నారు పెద్దలు. ఈ పరోపకార పద్ధతి మనకు ప్రకృతి ప్రసాదిస్తుంది. ప్రకృతిలో పుట్ట, గుట్ట, చెట్లు, చేమ, నదీనదాలు ఏవీ తమ కోసం జీవించవు. అవి అన్ని కూడా ఇతరుల ప్రాణులకై జీవిస్తాయి. మరి జ్ఞాన సంపన్నులమైన మనం వాటిలాగా జీవిస్తూ పరుల కోసం పాటుపడటమే నిజమైన మానవ లక్షణం.

మనిషి లక్షణాలలో ముఖ్యమైనది మాట. అలాంటి మాటను పొదుపుగా మాట్లాడాలి. ఇతరుల మనసును కష్టపెట్టే విధంగా ఎప్పుడూ మాట్లాడకూడదు. "మన్ సమత నజా" అన్నారు మహనీయ ముహమ్మద్(స). అంటే నిశ్శబ్దంగా ఉండి ఎదుటివారి మాటను విన్నవాడు మోక్షం పొందాడని అర్థం. మూట పోతే దొరుకుతుంది కానీ మాట పోతే తిరిగి పొందలేం. ప్రాణం పోయినా అసత్య మాటలను మాట్లాడకూడదు. కాబట్టి ఎల్లప్పుడూ సత్యవాక్కుకై కట్టుబడి ఉండటం మంచి లక్షణం.

### కోపమున ఘనత కొంచెమై పోవును

తన కోపమే తన శత్రువు అనే వాక్యాలను పరిశీలిస్తే... మనిషికి కోపం అత్యంత ప్రమాదకారి, కోపం వలన అనేక అనర్థాలు జరుగుతాయి అని తెలుస్తుంది. కాబట్టి కోపాన్ని దిగమ్రింగటం మంచి లక్షణం. కోపాన్ని దిగమ్రింగి, ప్రజల విపరీత ధోరణిని మన్నించే సదాచార సంపన్నులను అల్లాహ్ ప్రేమిస్తాడు.

(దివ్య ఖుర్ఆన్ 3: 134)

'తన శాంతమే తనకు రక్ష' అన్నారు పెద్దలు. కావున ఎల్లప్పుడూ శాంతంగా ఉండటం ఎంతో మంచి లక్షణం.

"ఇనుము విరిగెనేని యినుమారు ముమ్మారు
కాచి యతుక నేర్చు కమ్మరీడు
మనసు విరిగెనేని మరి యంట నేర్చునా?
విశ్వదాభిరామ వినుర వేమ"

వేమన గారు చెప్పినట్లు ఇనుము విరిగితే దానిని రెండు మూడు సార్లు అతికించవచ్చు. కాని అదే మనిషి మనసు ఒకసారి విరిగితే అది జీవితాంతం అతుక్కోదని దీని అర్థం. మనసును నిగ్రహించుకోవడం మనిషి అత్యంత పవిత్రమైన లక్షణం. కాబట్టి మానవులు మనసును అదుపులో పెట్టుకోవాలి. అది అదుపులో ఉండాలంటే ముందుగా మనం మనలో ఉన్న అరిషడ్వర్గాలను... అనగా కామ, క్రోధ, మోహ, లోభ, మద, మాత్సర్యాలనే ఈ ఆరు అంతరంగ శత్రువులను అదుపులో పెట్టుకున్నప్పుడు మంచి లక్షణాలు అలవడుతాయి. లేదంటే అనర్థాలకు దారి తీసి తమ బతుకులు అల్లకల్లోలాలవ్వడమే కాకుండా సమాజం, దేశం కూడా అల్లకల్లోలం అవుతుంది. కాబట్టి మంచి లక్షణాలను అలవరుచుకున్నప్పుడే అవి నేటి మానవులకు రక్షణ కవచాలుగా నిలుస్తాయనడంలో ఏమాత్రం సందేహం లేదు.



## (మే 31న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం)

# ఆరోగ్యానికి పొగ పెట్టొద్దు

**డా. ఎన్. కలీల్, హైదరాబాద్**

పొగకట్ట కాళ్లపైన నడవదు,
జీవితపు దీపాన్ని ఆర్పుతుంది.
ఒక నిమిషం మజా కోసం తాగితే,
ఒక యుగం బాధలే మిగులుతాయి.

నిన్ను కాదు- నీ ఇంటినీ కలుషితం చేస్తుంది,
పిల్లల చిరునవ్వుల్ని పొగలో మింగేస్తుంది.
పొగాకు కాదు- ప్రాణమే ముద్దు,
నీ శ్వాసే నీకు జీవదానం!

ఉత్సుకత కొద్దీ ఊరిస్తుంది.
ఉబలాటం కొద్దీ ఆకర్షిస్తుంది.
క్రమంగా అలవాటుగా మారుతుంది.
అవును
పొగ తాగడం ముందు ఆసక్తితోనే ఆరంభమవుతుంది.

మనిషి సంతోషంగా ఉండాలంటే ముందుగా కావల్సింది మంచి ఆరోగ్యం. అందుకే 'ఆరోగ్యమే మహాభాగ్యం' అని అంటారు. అయితే కొంతమంది విధివశాత్తు ఆ భాగ్యానికి నోచుకోలేక పోతుంటే, మరి కొంతమంది దానిని చేజేతులా దూరం చేసుకొంటున్నారు. ఈ రెండవ కోవకి చెందిన వారిగా ధూమపాన ప్రియుల్ని పేర్కొనవచ్చు. పొగాకు పొగని చుట్ట, బీడీ, సిగరెట్ లాంటి ఏ రూపంలో పీల్చినప్పటికీ అది ధూమపానమే అవుతుంది. పొగతాగడం ఆరోగ్యానికి మంచిది కాదని మనలో చాలా మందికి తెలుసు. అయినప్పటికీ నేటి సమాజంలో పొగతాగేవారి సంఖ్య ఇంకా కొనసాగుతూనే ఉంది. పేదలు-సంపన్నులు, యువకులు-వృద్ధులు అనే తారతమ్యం లేకుండా చాలా మందిలో ఈ ధూమపాన వ్యసనం ఏదో ఒక రూపంలో కన్పిస్తూనే ఉంటుంది. పొగ పీల్చడం వల్ల రక్తపోటు, క్యాన్సర్, అల్సర్ వంటి వ్యాధులు సంభవిస్తాయని 'ప్రపంచ ఆరోగ్య సంస్థ' పదే పదే హెచ్చరిస్తున్నా, ధూమపాన ప్రియులు ఖాతరు చేయడం లేదు. అలాగే 'పొగతాగడం ఆరోగ్యానికి హానికరం' అని సిగరెట్ పెట్టెల మీద ముద్రించే ప్రభుత్వం వారి చట్టపరమైన హెచ్చరికలను సైతం పెడచెవిన పెడుతున్నారు. పొగాకు వినియోగం భారత్‌లో కొంతమేర తగ్గినప్పటికీ ఇంకా 120 మిలియన్ల మంది దాకా ధూమపానం చేసేవారున్నారు. మన దేశంలో పట్టణాలకంటే గ్రామీణ ప్రాంతాల్లో పొగతాగే అలవాటు ఎక్కువ. ప్రాణాంతకమైన పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల క్యాన్సర్, ఊపిరితిత్తుల

వ్యాధులు తదితర జబ్బులతో ఏటా ప్రపంచవ్యాప్తంగా 8 మిలియన్ల మంది ప్రాణాలు కోల్పోతున్నారు. మన దేశంలో 1 మిలియన్ కంటే ఎక్కువ మంది మరణిస్తున్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ధూమపానాన్ని గురించి శాస్త్రజ్ఞులు నిశిత పరిశోధనలు గావించి, కొన్ని నగ్న సత్యాలు కనుగొన్నారు. పొగతాగడం వల్ల బ్రోంకైటీస్, ఆస్తమా, రక్తపోటు, గుండెనొప్పి, ఊపిరితిత్తుల క్యాన్సర్, గొంతు క్యాన్సర్ వంటి వ్యాధులు సంభవిస్తాయని నిర్ధారించారు. పొగాకు పొగలో దాదాపు 4వేల రసాయనిక విష పదార్థాలున్నట్లు శాస్త్రజ్ఞుల అంచనా! భారత్‌లో నోటి క్యాన్సర్ మరణాల్లో 90 శాతం పొగాకును సేవించడం వల్లే సంభవిస్తున్నాయని 'జాతీయ పొగాకు నియంత్రణ మండలి' పేర్కొంది. గుండెనొప్పి వల్ల సంభవించే మరణాల్లో 45 శాతం కేవలం ధూమపానం వల్లేనని 'హార్ట్‌కేర్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా' వెల్లడించింది. అలాగే ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో చనిపోయే ప్రతి 10 మందిలో 9 మంది పొగతాగడం వల్లే క్యాన్సర్ బారినపడి చనిపోతున్నట్లు అధ్యయనాల్లో తేలింది. ధూమపానం వల్ల పొగ తాగని వారికి కూడా అనేక అనర్థాలు సంభవిస్తున్నాయి. పొగతాగే వారి పక్కన పొగతాగని వారుంటే మామూలు ధూమపానంవల్ల వచ్చే వ్యాధులన్నీ వీరికి కూడా వస్తాయని వైద్యులు అంటున్నారు. పాసివ్ స్మోకింగ్ ఇతరుల ఆరోగ్యానికి ఎంతో హాని కలిగిస్తుందనీ, తద్వారా వారికి ప్రమాదకరమైన ఊపిరితిత్తుల క్యాన్సర్ వంటి వ్యాధులు సోకుతున్నాయని వాషింగ్టన్‌లోని 'ప్రపంచ రక్షక సంస్థ' పేర్కొంది. గత అయిదేళ్ళు కరోనా మహమ్మారి పెను భూతంలా ప్రపంచాన్నంతటినీ వెంటాడింది. భారత్‌లో కోవిడ్ ఉధృతంగా వ్యాపించి ప్రజల ఆరోగ్యాలను, ప్రాణాలను హరించి వేసింది. ఆ విపత్కర పరిస్థితులలో ధూమపాన ప్రియులు ఎక్కువగా కరోనా బారినపడి, ఊపిరితిత్తులు దెబ్బతిని మృత్యువాత పడ్డారు.

ప్రతి సంవత్సరం మే 31వ తేదీను ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవంగా జరుపుకుంటారు. ఈ దినోత్సవ ఉద్దేశ్యం పొగాకు వాడకాన్ని తగ్గించడం, దానివల్ల కలిగే ఆరోగ్య నష్టాలపై ప్రజలలో అవగాహన పెంచడం. 1987లో WHO ఈ దినోత్సవాన్ని మొదలుపెట్టింది. తొలిసారి 1988లో ఏప్రిల్ 7న జరుపుకున్నారు. తరువాత దీనిని ప్రతి సంవత్సరం మే 31న జరిపేందుకు నిర్ణయించారు. దీని ప్రధాన లక్ష్యం- పొగాకు వాడకం వల్ల వచ్చే ప్రమాదాలను ప్రపంచ వ్యాప్తంగా ప్రజలకు తెలియజేయడం.

## ప్రతి సంవత్సరం WHO ఒక ప్రత్యేక థీమ్‌ను ప్రకటిస్తుంది. కొన్ని ఉదాహరణలు:

2020- యువతను పొగాకు కంపెనీల బహిరంగ వ్యూహాల నుండి రక్షించడం

2021 - ఉద్యమించండి- మానండి

2022 - పర్యావరణానికి పొగాకు ముప్పు

2023 - పొగాకు కంటే ఆహారం ముఖ్యం

2024- పిల్లల్ని పొగాకు పరిశ్రమల జోక్యం నుండి రక్షించండి

2025 -Unmasking the Appeal. ఇది పొగాకు, నికోటిన్ పరిశ్రమల చాకచక్యమైన వ్యూహాలపై కేంద్రీకరించింది. ఈ పరిశ్రమలు ఆకర్షణీయమైన ప్యాకేజింగ్, డిజిటల్ మార్కెటింగ్ వ్యూహాలను ఉపయోగించి యువతను లక్ష్యంగా చేసుకుంటాయి. పొగాకు వినియోగాన్ని కొనసాగించడానికి ప్రయత్నిస్తాయి. ఈ మోసపూరిత వ్యూహాల నుండి బయటకు తీసి, భవిష్యత్తు తరాలను రక్షించడానికి, బలమైన నియంత్రణ చర్యలను ప్రోత్సహించడానికి డబ్ల్యుహెచ్ఓ పనిచేస్తోంది.

## పొగాకు వల్ల కలిగే హానికర ప్రభావాలు

ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం 80 లక్షల మందికి పైగా పొగాకు వాడకం వల్ల మరణిస్తున్నారు. వీరిలో సుమారు 13 లక్షల మంది పరోక్షంగా, అంటే పాసివ్ ధూమపానం (passive smoking) వల్ల మరణిస్తున్నారు.

## పొగాకు వలన కలిగే రోగాలు

ఊపిరితిత్తుల కాన్సర్, నోటి, గొంతు కాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు, స్ట్రోక్, శ్వాసకోశ వ్యాధులు, గర్భిణీ స్త్రీలకు మరియు శిశువులకు సమస్యలు.

## పర్యావరణానికి పొగాకు వల్ల నష్టం

పొగాకు పండించేందుకు అడవులను నరికించటం, భారీగా నీటి వాడకం, రసాయనాల వినియోగం, సిగరెట్ మిగతా భాగాలను పర్యావరణంలో వేయడం వంటివి తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తున్నాయి. ప్రతి సంవత్సరం 4.5 ట్రిలియన్ సిగరెట్ బుట్టలు పారవేస్తున్నారు. ఇవి పూర్తిగా కరగడానికి సంవత్సరాలు పడతాయి.

## ప్రపంచవ్యాప్తంగా తీసుకుంటున్న చర్యలు

పొగాకు ఉత్పత్తులపై అధిక పన్నులు వేయడం, బహిరంగ ప్రదేశాలలో పొగతాగడంపై నిషేధం, ప్రచారాల్లో పొగాకు ప్రకటనలు

నిషేధించడం, చికిత్సా సేవల ద్వారా మానేందుకు మద్దతు ఇవ్వడం, సిగరెట్ ప్యాకెట్‌పై హెచ్చరికల చిత్రాలు ముద్రించడం, వ్యక్తిగత, సామూహిక కృషి అవసరం. ప్రభుత్వ చర్యలతో పాటు, మన బాధ్యత కూడా ఉంది:

## ప్రజల పాత్ర

❖ ధూమపానం మానేందుకు కృషి చేయాలి.

❖ ధూమపానానికి వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమాలలో పాల్గొనాలి.

❖ చిన్న పిల్లలకు, యువతకు ఆదర్శంగా ఉండాలి.

❖ ధూమపానం చేసే వారికి సహాయం చేసి, మానుకునే మార్గం చూపాలి.

## ప్రభుత్వ బాధ్యత

❖ ధూమపానం, పొగాకు ఉత్పత్తులపై నియంత్రణ.

❖ ధూమపాన విపణిపై పన్నులు, నియమాలు.

❖ విద్యా సంస్థలలో, ప్రజా స్థలాలలో పొగాకు ఉత్పత్తుల వినియోగంపై నిషేధం.

❖ రోగ నిర్ధారణ, చికిత్సకు సౌకర్యాల ఏర్పాట్లు.

## పొగాకు మానేందుకు మార్గాలు:

❖ నికోటిన్ థెరపీ వైద్యుల సహాయం తీసుకోవడం.

## కౌన్సిలింగ్

మొబైల్ యాప్స్, హెల్ప్‌లైన్లు ద్వారా మద్దతు పొందడం.

## పూర్తి నిషేధం అవసరం

పొగాకు ప్రమాదాన్ని గుర్తించిన కేంద్రం ధూమపానాన్ని దేశవ్యాప్తంగా బహిరంగ ప్రదేశాలలో నిషేధిస్తూ 2008లో చట్టం చేసింది. అయితే చట్ట నిబంధనలు నిర్దిష్టంగా అమలు కాకపోవడంతో, ప్రజల్లో అవగాహన కొరవడి ఆశించిన ఫలితాలు లభించడం లేదు. ప్రస్తుతం రైళ్ళు, బస్సులలో పొగతాగడంపై నిషేధం సాధ్యమైంది. ఇతరత్రా బహిరంగ ప్రదేశాలలో మాత్రం దీని పీడ పూర్తిగా విరగడ కాలేదు. ముఖ్యంగా టీ స్టాల్స్ దగ్గర, రోడ్లు వెంబడి బహిరంగ ధూమపానం విచ్చలవిడిగా కొనసాగుతూనే ఉంది. మనిషి తెలిసి చేసే ఈ పొరపాటు వల్ల వాళ్ళ ఆరోగ్యంతో పాటు పర్యావరణానికీ నష్టం వాటిల్లుతోంది. తీవ్ర అనర్థాలను తెచ్చిపెడుతున్న ధూమపాన నిషేధానికి ప్రభుత్వాలు మరింత పకడ్బందీగా చర్యలు చేపట్టాలి. 'బహిరంగ ధూమపాన నిషేధ చట్టంలోని నిబంధనల్ని కట్టుదిట్టంగా అమలుచేసి, కనీసం పొగతాగని వారి ఆరోగ్యాలకైనా రక్షణ కల్పించాలి. చట్టాన్ని ఉల్లంఘించిన వారిని కఠినంగా శిక్షించాలి. నేడు చలన చిత్రాలు, టీవీ సీరియళ్ళలో ఒక ప్రక్క నటులు దర్జాగా సిగరెట్లు కాల్చే దృశ్యాలు ప్రదర్శిస్తూ, మరోప్రక్క చిన్నచిన్న అక్షరాలతో 'పొగతాగడం ఆరోగ్యానికి హానికరం' అంటూ చూపించడం విచిత్రంగా ఉంటోంది. అలాగే సిగరెట్ పెట్టెలపై ముద్రించే ధూమపానం ఆరోగ్యానికి ప్రమాదకరం' అనే హెచ్చరిక ప్రకటన కూడా మొక్కుబడి చర్యగానే మిగిలిపోతోంది. పొగాకు చేసే హాని అంతా ఇంతా కాదు. ధూమపానాన్ని కట్టడి చేయడానికి ప్రభుత్వాలు చిత్తశుద్ధితో ప్రయత్నించకుండా, ఏటా కొత్త కొత్త పొగాకు ఉత్పత్తులను చేస్తూ ధనార్జనలో పోటీ పడుతున్నాయి. పొగాకు ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలో 3వ స్థానంలో ఉంది. ప్రజల ప్రాణాల్ని హరించేస్తున్న ధూమపానానికి అడ్డుకట్ట వేయాలంటే ప్రభుత్వం పొగాకు ఉత్పత్తులను పూర్తిగా నిర్మూలించడం ఒక్కటే మార్గం. అయితే మన దేశంలో పొగాకు పండించే రైతులు, దాని ఉత్పత్తులపై ఆధారపడిన కూలీలు, చిన్న తరహా వ్యాపారులు, బీడీ కార్మికులకు ప్రత్యామ్నాయ మార్గాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించాలి. దేశ ప్రగతి ప్రజల ఆరోగ్యంపై ఆధారపడి ఉంటుందన్నది వాస్తవం. అయితే ఆ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుందనేది కూడా అంతే సత్యం. కనుక ప్రజల ఆరోగ్యాన్ని నాశనం చేస్తున్న పొగాకు వాడకాన్ని పూర్తిగా నిషేధించడం ఎంతైనా ఆవశ్యకం. ప్రభుత్వ చర్యలతోపాటు ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు కూడా దీని నిర్మూలనకు పాటుపడాలి. ధూమపానం వల్ల తమ ఆరోగ్యాలు, పక్కవారి ఆరోగ్యాలు పాడవటమేగాక, ధూమపానం చేసేవారికి ఆర్థికపరమైన ఖర్చులు కూడా పెరుగుతాయనేది నిర్వివాదాంశం. 'ప్రివెన్షన్ ఈజ్ బెటర్ దేన్ క్యూర్' అన్నారు. అంచేత ఈ ధూమపానం అలవాటుకి స్వస్తి పలికి, ఆరోగ్య లక్ష్య సాధనకై ధూమపాన ప్రియులు కూడా కృషి చేయాలి.

పొగాకు వాడకం జీవితాన్ని నాశనం చేస్తుంది. ఇది ఒక వ్యక్తిగత సమస్య మాత్రమే కాదు, సామాజిక మరియు పర్యావరణ సమస్య కూడా. మనం కలిసికట్టుగా పని చేస్తే ధూమపానం లేని ప్రపంచం సాధ్యం. ఆరోగ్యంగా, శుభ్రమైన భవిష్యత్తు కోసం ఈరోజు మీరు చేసే చిన్న నిర్ణయం గొప్ప మార్పుకు నాంది అవుతుంది. ప్రపంచ ధూమపానం నిరోధక దినోత్సవం మనకు గుర్తు చేస్తుంది- ఆరోగ్యాన్ని కాపాడుకోవడం మన చేతుల్లోనే ఉంది. ధూమపానం మానుకొని ఆరోగ్యవంతమైన జీవన శైలిని అలవరచుకుందాం. పొగాకుకు గుడ్‌బై చెబుదాం, జీవితంలో హాయిగా ముందుకెళ్దాం.

# ధర్మబద్ధ సంపాదన

- ముహమ్మద్ అజ్గర్ అలీ

**ఇస్లాంలో,** "హలాల్ డబ్బు" అనేది ఇస్లామిక్ చట్టం లేదా షరియాకు అనుగుణంగా సంపాదించిన సంపదను సూచిస్తుంది.

హలాల్ డబ్బు ఖురాన్, సున్నత్ (ప్రవక్త ముహమ్మద్ సంప్రదాయంలో పేర్కొన్న నైతిక ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలి. సంపాదన హలాల్ అవునా కాదా అనేది ఇస్లామ్ మౌలిక సూత్రాలు నిర్ణయిస్తాయి.

### రిబా (వడ్డీ) పై నిషేధం

రిబా లేదా వడ్డీ, ఇస్లామిక్ ఫైనాన్స్‌లో అత్యంత తీవ్రమైన నిషేధాలలో ఒకటి. రుణాలపై వడ్డీ వసూలు చేయడాన్ని దివ్య ఖురాన్ స్పష్టంగా నిషేధిస్తుంది, ఇస్లాంలో వడ్డీ దోపిడీ, అన్యాయంగా పరిగణించబడుతుంది.

జూదం, మద్యం, పంది మాంసం, అనైతిక సేవల వంటి హరామ్ (నిషిద్ధ) కార్యకలాపాల నుండి వచ్చే ఆదాయం నిషిద్ధం. ఈ వ్యాపారాలలో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా పాల్గొనడం అన్నీ నిషిద్ధమే.

### నైతిక, న్యాయమైన-వాణిజ్య పద్ధతులు

అన్ని వ్యాపార వ్యవహారాలలో ఇస్లాం పరస్పర సమ్మతి, నిజాయితీ, న్యాయాన్ని ప్రోత్సహిస్తుంది. మోసపూరిత పద్ధతులు, మోసం, దోపిడీ ఖచ్చితంగా నిషేధించబడ్డాయి.

### జకాత్, సంపద శుద్ధి

ముస్లింలు జకాత్ చెల్లించాలి, ఏటా సేకరించిన సంపదలో 2.5 శాతం జకాత్ తీయాలి. జకాత్ సంపదను శుద్ధి చేస్తుంది. సామాజిక, ఆర్థిక న్యాయాన్ని సాధిస్తుంది.

### హలాల్ సంపాదన

ముస్లింలు చట్టబద్ధమైన ఉపాధిని, ఇస్లామిక్ నీతికి అనుగుణంగా వ్యాపారాలను నిర్వహించాలి. హరామ్ కార్యకలాపాలకు సహాయం చేయడం లేదా దోపిడీ పద్ధతులు ఆమోదయోగ్యం కాదు.

### హలాల్ బ్యాంకింగ్, ఫైనాన్స్

ఆధునిక ఇస్లామిక్ ఫైనాన్స్ పరిశ్రమ షరియా చట్టానికి అనుగుణంగా ఉండే వివిధ రకాల ఆర్థిక ఉత్పత్తులు, సంస్థలను అభివృద్ధి చేసింది.

### వాటి ముఖ్య లక్షణాలు

**ఇస్లామిక్ బ్యాంకులు :** వడ్డీ లేకుండా పొదుపు, పెట్టుబడి ఖాతాలను అందిస్తాయి. బదులుగా, వారు ముదరబా (ట్రస్టీ భాగస్వామ్యం), ముషారకా (జాయింట్ వెంచర్) వంటి లాభ-నష్ట భాగస్వామ్య నమూనాలను ఉపయోగిస్తారు.

**తకాఫుల్ (ఇస్లామిక్ బీమా):** ప్రమాదం నుండి లాభం కంటే పరస్పర సహాయం, భాగస్వామ్య బాధ్యత సూత్రంపై పనిచేస్తుంది. ఇస్లామిక్ మైక్రోఫైనాన్స్ : పేదలలో entrepreneurshipను పెంచడానికి చిన్న, వడ్డీ లేని రుణాలను అందిస్తుంది.

ఇస్లాంలో, డబ్బు సంపాదించడం, ఖర్చు చేయడం వెనుక ఉన్న సంకల్పం చాలా ముఖ్యమైనది. సంపదను దురాశ కోసం కాకుండా ఒకరి బాధ్యతలను నెరవేర్చడానికి, కుటుంబాన్ని పోషించడానికి, సమాజానికి తోడ్పడటానికి, అల్లాహ్ ప్రసన్నతను పొందడానికి ఉపయోగించాలి. సంపదను దుర్వినియోగం చేయడం లేదా స్వార్థ ప్రయోజనాల కోసం నిల్వ చేయడం కూడా నిరుత్సాహపరచబడుతుంది.

### హలాల్ డబ్బు ఖర్చు చేయడం


డబ్బును ఎలా సంపాదించారనేది ఎంత ముఖ్యమో దానిని ఎలా ఖర్చు చేస్తారు అనేది కూడా అంతే ముఖ్యం. ఖర్చు చేయడం అనేది అనుమతించదగిన అవసరాలు, కోరికల కోసం, ఒకరి కుటుంబం, ఆధారపడినవారిని పోషించడానికి జరగాలి. దాతృత్వం, సమాజ అభివృద్ధికోసం దుబారాను నివారించాలి.

అల్లాహ్ ఖురాన్‌లో (సూరా అల్-ఇస్రా, 17:26-27) ఇలా సెలవిచ్చాడు : "బంధువుల పట్ల మీ విధులను నిర్వహించండి. పేదవారి పట్ల, బాటసారుల పట్ల మీ విధులను నిర్వర్తించండి. వృధా ఖర్చు చెయ్యకండి. వృధా ఖర్చు చేసేవారు షైతాన్ సోదరులు."

### చట్టవిరుద్ధమైన సంపద పరిణామాలు

చట్టవిరుద్ధమైన మార్గాల ద్వారా సంపాదించిన డబ్బు అనేక విపరీత సామాజిక పరిణామాలకు దారితీస్తుంది. హరామ్ సంపాదనను వినియోగిస్తే దుఆలు (ప్రార్థనలు) అంగీకరించబడవని ముహమ్మద్ ప్రవక్త(స) హెచ్చరించారు. ఇది సామాజిక అస్థిరతకు దారితీస్తుంది. ❖

పత్రిక కాదిది, ఆత్మవేదన
క్రియాత్మక చేతన
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక




**ఇస్లామ్ ధర్మం** తన అనుయాయుల నుండి మొట్టమొదట కోరేదేమిటంటే వారు తమను తాము సంస్కరించుకోవాలి. ఆ తరువాత ఇతరులను సంస్కరించే ప్రయత్నం చెయ్యాలి. విశ్వాసం, ఆరాధనల ప్రణాళిక ఏదైతే ఇస్లామ్ మనిషి కోసం రూపొందించిందో దాని అసలు ఉద్దేశం కూడా మనిషి స్వీయ సంస్కరణయే. ఇస్లామ్ ధర్మం విధించిన విశ్వాసాల ద్వారా ఆత్మ ప్రక్షాళన జరుగుతుంది. ఆత్మ పరిశుద్ధత కలుగుతుంది. ఆరాధనల ద్వారా ఆచరణాత్మక జీవితం అలవడుతుంది. ధర్మంపై స్థిరంగా, ధర్మాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దటం కూడా జరుగుతుంది. సంస్కరణకు ఇష్టపడనివారు ఇస్లామ్ ధర్మ అనుయాయులు ఎంతమాత్రం కాజాలరు.

మనిషి ఎప్పుడైనా తనపై తాను దృష్టిని సారించినప్పుడు అతనికి తనలో ఉన్న ఏవో నాలుగైదు చిన్న బలహీనతలే కనిపిస్తాయి. అంతేకాని పెద్దపెద్ద బలహీనతలు లేవని అతని మనసు అతన్ని బుజ్జగిస్తుంది. ఉదాహరణకు తన పొరుగువానితో ఎప్పుడైనా విభేదాలు ఏర్పడినప్పుడు ఆ పొరుగువానిలోనే ఫలానా బలహీనతలు ఉన్నాయని తాను ఆ బలహీనతలకు అతీతుడనని అతని మనసుకు అతనిని నిద్రపుచ్చుతుంది. ఆ పొరుగువానిలో చిన్న చిన్న బలహీనతలున్నా వాటిని అతి పెద్దవిగా చేసి చూపిస్తుంది. ఆ విభేదాలకు స్వయంగా అతను కారణమైనా అతని మనస్సు ఆ సత్యాన్ని స్వీకరించదు. ఎదుటివాడే దానికి కారణమని ఎదుటివానిపైనే నిందలు మోపుతుంది.

మనిషికి స్వయంగా తన గురించి క్షుణ్ణంగా తెలుసుకోవటం, తన లోపాలను గుర్తించటం చాలా కఠినంగా కనిపిస్తుంది. ఒకవేళ తెలిసినా దానిని సరిదిద్దటం అతనికి ఇంకా కఠిన కార్యం. కాని స్వీయ సంస్కరణ ఇస్లామ్ ధర్మం తప్పనిసరి చేసినప్పుడు మనిషి దానిపై ఆచరించటం తప్పనిసరి అయిపోతుంది. కనుక మనిషి తనను తాను తెలుసుకోవటానికి, తన బలహీనతలను తాను తెలుసుకోవటానికి తన రోజులోని ఒక సమయం కేటాయించుకోవాలి. తన అలవాట్లపై, తన అవసరాలపై, తన కార్యక్రమాలపై దృష్టిని సారించాలి. ఇంకా తన గురించి ఇతరులు ఏమి చెప్పుకుంటున్నారో వాటిని కూడా వినటానికి సిద్ధంగా ఉండాలి. ఏదైనా తన బలహీనతను గురించి ఇతరుల ద్వారా విన్నప్పుడు ఆగ్రహోదగ్రుడు కాకుండా తన బలహీనతను తనలో తాను వెదకాలి. అది తెలిసినప్పుడు తన బలహీనతను ఎత్తి చూపిన వారికి కృతజ్ఞతలు కూడా తెలుపుకుంటే ఇంకా మంచిది. సత్యం బహు చేదుగా ఉంటుంది. కాని తనలో ఉన్న వ్యాధిని నయం చేయటానికి ఆ చేదు గుళికలను మింగటం కూడా తప్పనిసరి

అవుతుంది. మనిషి స్వీయ సంస్కరణకు సిద్ధమైనప్పుడు వీటనన్నింటినీ భరించక తప్పదు.

స్వీయ సంస్కరణ కార్యక్రమాన్ని ప్రారంభించినప్పుడు అన్నింటి కంటే ముందు తాను విశ్వసించిన ఇస్లామ్ ధర్మం జీవితానికి సంబంధించిన ప్రతి విషయంలో తనకు దిశా నిర్దేశనం చేస్తుందనే విషయంలో అతనికి గట్టి నమ్మకం ఉండాలి. మనిషికి కలిగే కష్టనష్టాలన్నింటి పరిష్కారం కూడా అందులోనే లభిస్తుంది. అందులోనే మనిషికి ఇహలోక సుఖం, పరలోక సాఫల్యం కూడా తప్పకుండా లభిస్తుంది అనే విషయాన్ని విశ్వసించాలి. ఇస్లామ్ ధర్మ అనుయాయులు కొన్ని విషయాలలో అయితే ఇస్లామ్ ధర్మాన్ని అనుసరించి మరికొన్ని విషయాలలో ఇతరుల మాట లను లేదా తన మనసు మాటలనో విని ఆచరించటం ఎంత మాత్రం మంచిది కాదు. దీనికోసం అతనికి ధర్మజ్ఞానాన్ని అవలంబించటం తప్పనిసరి అయిపోతుంది. అయితే ఆ జ్ఞానాన్ని మనిషి రెండు విధాలుగా పొందవచ్చు.

మొట్టమొదటి విధానం, ధర్మజ్ఞానాన్ని పొందటానికి ఖుర్‌ఆన్ గ్రంథాన్ని, మౌలిక విషయాలను బోధించిన ఇతర పుస్తకాలను అధ్యయనం చెయ్యాలి. వాటి ద్వారా మనిషి ఆచరించే ఆరాధనల గురించి, నైతిక విలువల గురించి, సామాజిక విషయాల గురించి, సాంఘిక విషయాలను గురించి అతను క్షుణ్ణంగా తెలుసుకోవాలి.

రెండో విధానం ఏమిటంటే, స్వీయ సంస్కరణ కోరే మనిషి ఇస్లామ్ ధర్మజ్ఞానాన్ని అవలంబించే జ్ఞానవంతులతో సన్నిహితంగా ఉండే ప్రయత్నం చెయ్యాలి. వారు గడిపే ఇస్లామీయ జీవిత విధానాన్ని అనుసరించటానికి కృషి చెయ్యాలి. ఈ రెండు విధానాలు మనిషికి స్వీయ సంస్కరణలో చాలా తోడ్పడుతాయి.

ఆ తరువాత మనిషి స్వయంగా ఆత్మపరిశుద్ధతా కార్యక్రమాన్ని మొదలుపెట్టాలి. మొట్టమొదట తన మొత్తం జీవితాన్ని విశ్లేషించు కోవాలి. ఏ ఆలోచన, ఏ విశ్వాసం, ఏ ఆరాధన, ఏ జ్ఞానం, ఏ విధానం అయితే ధర్మాన్నుంచి దూరంగా తీసుకెళుతుందో దానిని గమనించాలి, గుర్తించాలి. ఆ తరువాత దాని నుండి దూరంగా జరిగి పోవాలి. చాలామంది తన నోటితో అయితే ఇస్లామ్ ధర్మాన్ని అనుసరిస్తున్నామని ఘంటాపథంగా చెబుతారు. తాము ముస్లిములమనే ప్రకటిస్తారు. కాని వారి జీవితాలు వాటికి విభిన్నంగా ఉంటాయి. ఆత్మ ప్రక్షాళన చేసుకునేవారు అలాంటి వారిపై ఎంతమాత్రమూ దృష్టి సారించకూడదు. ఎందుకంటే ఇస్లామ్ ధర్మం కలుషితమైన విశ్వాసాన్ని ఎంతమాత్రమూ స్వీకరించదు. అది స్వచ్ఛమైన జీవిత విధానాన్ని బోధిస్తుంది. స్వచ్ఛమైన జీవితం గడిపే మనిషినే అది స్వీకరిస్తుంది.

కాబట్టి మనిషి ఒక వయసుకు చేరినప్పుడు అతనికి మంచి చెడు అనేది స్పష్టంగా కనిపిస్తుంది. అతను దానిపై పరదా కప్పకూడదు. ఆ అద్దంలో తనను తాను చూసుకోవాలి. తన లోపాలను సరిదిద్దుకోవాలి. కొంతమంది ఆరాధనలకు అధిక ప్రాముఖ్యతను ఇస్తారు. సామాజిక హక్కుల పట్ల నిర్లక్ష్యం వహిస్తారు. కొంతమంది సామాజిక హక్కులకు అధిక ప్రాముఖ్యతను ఇస్తారు. ఆరాధనలకు ప్రాముఖ్యత ఇవ్వరు. మరికొంతమంది తమను సంస్కరించుకోవటానికి అధిక ప్రాముఖ్యతను ఇస్తారు. ఇతరు లను సంస్కరించటానికి ఎలాంటి కృషి చెయ్యరు. ఇంకా కొంతమంది తమను తాము సంస్కరించుకోవటానికి ఎలాంటి ప్రాముఖ్యతనివ్వరు. కాని ఇతరులను సంస్కరించటానికి తమ పూర్తి శక్తిని ధారపోస్తారు. ఇవన్నీ సమతుల్యత లేని గుణాలు. వీటి ద్వారా లాభం కంటే నష్టమే ఎక్కువగా ఉంటుంది.

కనుక మనిషి మొదట స్వీయ సంస్కరణపై అధిక దృష్టిని సారించాలి. అక్కడి నుంచి అతని జీవిత రంగాలన్నీ సరిదిద్దు కోవటం ప్రారంభిస్తాయి. మనిషిలో ఉండే లోపాలు సరిదిద్దుకో వటం ఒకటి రెండు రోజులలో జరిగే పని ఎంతమాత్రమూ కాదు. ఉదాహరణకు, ఒక మనిషిలో కోపం అధికంగా ఉంటుంది. అతను దానిపై అదుపు సాధించాలని భావిస్తాడు. అయితే అతను భావించినంత మాత్రాన అది అయిపోదు. దానికోసం అతను స్వయంగా తన మనసులో ఒక కార్యక్రమాన్ని మొదలుపెట్టాలి. నాకు కోపం ఎప్పుడెప్పుడు ఏయే విషయాలపై వస్తోంది, నేను కోపాన్ని ప్రదర్శించినప్పుడు కలిగిన లాభనష్టాలు ఏమిటి? బేరీజు వేసుకోవాలి. అతను కోపం గురించి దాని మంచీ చెడుల గురించి ఖుర్‌ఆన్, హదీసు గ్రంథాల ద్వారా తెలుసుకోవాలి. దైవప్రవక్త(స) గారి జీవిత గాథలో ఆయన(స)కు కోపం వచ్చినప్పుడు ఆయన దానిని ఎలా అధిగమించారో, దానికిగాను ఆయన(స)కు ఎలాంటి ప్రతిఫలం లభించిందో తెలుసుకోవాలి. ఆ తరువాత కోపం తెప్పించే విషయాలు ఏమిటో, ఆ ప్రజలు ఎవరో కూడా తెలుసు కోవాలి. మెల్లిమెల్లిగా ఆ విషయాల జోలికి పోకుండా ఆ ప్రజల వద్దకు పోకుండా జాగ్రత్తపడాలి. ఎవరైనా కోపం తెప్పించినా అంతగా పట్టించుకోకూడదు. ఈ విధంగా తనలో ఉన్న లోపాలను గుర్తించి క్రమక్రమంగా వాటిపై అదుపు సాధించవచ్చు. స్వీయ సంస్కరణకు ఇది ఒక చక్కటి మార్గం అని భావించవచ్చు. ఈ మార్గాన్ని అన్ని విషయాలలో అవలంబిస్తే స్వీయ సంస్కరణ తప్పకుండా జరుగుతుందని చెప్పవచ్చు.




## బడుల్లో షుగర్ బోర్డులు ఏర్పాటు చేయండి: సీబీఎస్ఈ

అధిక చక్కెర వినియోగాన్ని తగ్గించడంపై విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు బడుల్లో చక్కెర (షుగర్) బోర్డులు ఏర్పాటు చేయాలని సీబీఎస్ఈ తన అనుబంధ పాఠశాలలను కోరింది. ఇటీవల కాలంలో పిల్లల్లో సైతం టైప్ 2 మధుమేహం పెరుగుతున్న నేపథ్యంలో ఈ చర్యను చేపట్టింది. చక్కెర అధికంగా తినడం వల్ల వచ్చే అనారోగ్య సమస్యలపై తన అనుబంధ స్కూళ్లకు రాసిన లేఖలో ఆందోళన వ్యక్తం చేసింది. పంచదార కలిగిన చిరు తిండ్లు, పానీయాలు, ప్యాక్ చేసిన ఆహారం స్కూళ్ల ప్రాంగణాల్లో సులువుగా దొరకడం వల్లే బాలబాలికల్లో మధుమేహం కేసులు పెరుగుతున్నాయని తెలిపింది. దీనివల్ల ఊబకాయం, దంత సమస్యలు, ఇతర ఆరోగ్య సమస్యలనూ వారు ఎదుర్కొంటున్నారని చెప్పింది. బడుల్లో ఏర్పాటు చేసే షుగర్ బోర్డుల్లో రోజువారీ తీసుకోవాల్సిన పంచదార పరిమితి, జంక్ ఫుడ్, సాఫ్ట్ డ్రింక్స్‌ల్లో ఉండే చక్కెర స్థాయిలు, చక్కెర వల్ల కలిగే ఆరోగ్య సమస్యలను ప్రదర్శించాలని పేర్కొంది.

## ప్రపంచ పత్రికా స్వేచ్ఛా సూచిక 151వ స్థానంలో భారత్!

ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచికలో భారతదేశం 151వ స్థానంలో నిలిచింది. రిపోర్టర్స్ విఠౌట్ బోర్డర్స్ సర్వే చేసిన 180 దేశాలలో వరల్డ్ ప్రెస్ ఫ్రీడమ్ ఇండెక్స్‌లో భారతదేశం ర్యాంకింగ్ మునుపటి సంవత్సరం 159 నుండి ఈ సంవత్సరం 151కి మెరుగుపడింది. రిపోర్టర్స్ విఠౌట్ బోర్డర్స్ అని పిలవబడే ప్రభుత్వేతర సంస్థ 2002 నుంచి ప్రపంచ పత్రికా స్వేచ్ఛా సూచికను ప్రచురిస్తోంది. రాజకీయ, ఆర్థిక, శాసన, సామాజిక, భద్రత అనే ఐదు సూచికల ఆధారంగా ఆయా దేశాలలో పత్రికా స్వేచ్ఛను అంచనా వేస్తుంది. దీని ప్రకారం.. 2024లో భారత ర్యాంకు 159గా, 2023లో 161గా ఉన్నది. ఈ సారి ర్యాంకు కాస్త మెరుగుపడినా.. అది ఆశించినంత స్థాయి కాదనేది విశ్లేషకుల అభిప్రాయం.

## వక్ఫ్ సవరణ చట్టంపై సుప్రీం కీలక వ్యాఖ్యలు

వక్ఫ్ (సవరణ) చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు మే20న కీలక వ్యాఖ్యలు చేసింది. పార్లమెంట్ ఆమోదించిన చట్టం రాజ్యాంగబద్ధమేనన్న భావన సర్వత్రా ఉందని, అయితే వక్ఫ్ చట్టాన్ని సవాలు చేస్తున్న పిటిషనర్లు తమకు మధ్యంతర ఉపశమనం దక్కాలంటే బలమైన, విస్పష్టమైన ఆధారాలు చూపించాల్సిన అవసరం ఉంటుందని అంటున్నారని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జి మాసిహ్‌తో కూడిన ధర్మాసనం  వక్ఫ్ చట్టం చట్టబద్ధతను సవాలుచేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ ప్రారంభించింది. వక్ఫ్ బై కోర్ట్స్, వక్ఫ్ బై యూజర్, వక్ఫ్ బై డీడ్‌గా ప్రకటించిన ఆస్తులను డీనోటిఫై చేసే అధికారంతో సహా మూడు అంశాలపై మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని పిటిషనర్లు కోరుతున్నారు.

**మూడు అంశాలకే పరిమితం కావాలి**

పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ తన వాదన ప్రారంభిస్తూ వక్ఫ్ చట్టం చారిత్రకంగా, న్యాయపరంగా, రాజ్యాంగ సూత్రాల పరంగా పూర్తి విరుద్ధమని వాదించారు. న్యాయ వ్యవస్థ రహిత ప్రక్రియ ద్వారా వక్ఫ్‌ని స్వాధీనం చేసుకునే మార్గంగా ఆయన ఈ చట్టాన్ని వివరించారు. కేంద్ర ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదిస్తూ మూడు అంశాలకే పిటిషన్లపై విచారణ పరిమితం కావాలని అభ్యర్థించారు. వక్ఫ్ బై కోర్ట్స్, వక్ఫ్ బై యూజర్, వక్ఫ్ బై డీడ్‌గా ప్రకటించిన ఆస్తులను డీనోటిఫై చేసే అధికారం ఈ మూడు అంశాలలో ఒకటి. రాష్ట్ర వక్ఫ్ బోర్డులు, కేంద్ర వక్ఫ్ కౌన్సిల్ కూర్పునకు సంబంధించినది రెండో అంశం. ఎక్స్ అఫిషియో సభ్యులు తప్ప మిగిలిన సభ్యులందరూ ముస్లింలే ఉండాలన్నది పిటిషనర్ల వాదన. ఇక మూడవది, వక్ఫ్ ఆస్తా లేక ప్రభుత్వ ఆస్తా అన్న విషయాన్ని నిర్ధారించడానికి కలెక్టర్ విచారణ చేపట్టిన తర్వాత ఆ ఆస్తిని వక్ఫ్ ఆస్తిగా పరిగణించరాదన్న నిబంధనను పిటిషనర్లు వ్యతిరేకిస్తున్నారు. కాగా, తుషార్ మెహతా వాదనను కపిల్ సిబల్‌తోపాటు పిటిషనర్ల తరపున హాజరైన మరో సీనియర్ న్యాయవాది అభిషేక్ ఎం సింఘ్వి వ్యతిరేకించారు. విచారణ భాగాలుగా ఉండదని వారు వాదించారు. ఇది వక్ఫ్ ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు ఓ పద్ధతి ప్రకారం జరుగుతున్న ప్రయత్నమని, ఏ అంశాలను ప్రస్తావించాలో ప్రభుత్వం నిర్దేశించలేదని సిబల్ పేర్కొన్నారు. న్యాయపరమైన ప్రక్రియ లేకుండా కార్యనిర్వాహక మార్గం ద్వారా వక్ఫ్ ఆస్తులను స్వాధీనం చేసుకునే చట్ట నిబంధనలు సవరించారని సిబల్ వాదించారు. బాధిత కక్షిదారులు కోర్టులను ఆశ్రయించేందుకు ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వు ద్వారా వక్ఫ్ ఆస్తులను వక్ఫ్ నుంచి తప్పించనున్నారని ఆయన చెప్పారు.

## భవిష్యత్తులో మహమ్మారుల నివారణకు ప్రపంచ దేశాలు కలసి రావాలి

భవిష్యత్తులో తలెత్తే మహమ్మారుల నుంచి ప్రపంచ దేశాలను సురక్షితంగా వుంచేందుకు, అన్ని దేశాలకు అవసరమైన అత్యవసర వైద్యసదుపాయాలు సమానంగా అందేలా చూసేందుకు ప్రపంచంలోనే మొదటిసారిగా చారిత్రక మహమ్మారి నివారణా ఒప్పందాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ఆమోదించింది. ఈ ఒప్పందానికి అనుకూలంగా సభ్య దేశాలు ఓటు వేశాయి. కోవిడ్ మహమ్మారి సృష్టించిన తీవ్ర ప్రతికూల ప్రభావాలు, పర్యవసానాలు ఆ నేపథ్యంలో ప్రభుత్వాలు స్పందించిన తీరు, చేపట్టిన చర్యలపై మూడేండ్లకి పైగా ఉధృతంగా చర్చలు జరిపిన అనంతరం 78వ ప్రపంచ హెల్త్ అసెంబ్లీ ఈ చారిత్రక నిర్ణయం తీసుకుంది. కొవిడ్ సమయంలో ఆ మహమ్మారిని నివారించడానికి, ప్రతిస్పందించడానికి దేశాల మధ్య వున్న అంతరాలు, అసమానతలను పరిష్కరించడానికి ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా ఇటువంటి ఒప్పందం కుదిరింది. కొవిడ్ నేపథ్యంలో భవిష్యత్తులో వచ్చే మహమ్మారుల నుండి ప్రపంచాన్ని రక్షించేందుకు కలిసిరావాలని నిర్ణయించుకున్న సభ్యదేశాలను డబ్ల్యూహెచ్ఓ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధనామ్ అభినందించారు.

## పొగ త్రాగేవారికి హెచ్చరిక

పొగ తాగటం ఆరోగ్యానికి హానికరమన్న సంగతి తెలిసిందే. ఇది సీవోపీడీ, క్యాన్సర్ల వంటి జబ్బులకు, వైకల్యానికి దారితీస్తుంది. అంతేకాదు, ఆయుష్షునూ తగ్గిస్తుంది. కాల్చే ఒక్కో సిగరెట్టుతో సగటున 20 నిమిషాల జీవనకాలం తగ్గుతున్నట్టు యూనివర్సిటీ కాలేజ్ లండన్ అధ్యయనంలో తేలింది. లింగ పరంగా చూస్తే- మగవారిలో 17 నిమిషాలు, ఆడవారిలో 22 నిమిషాల ఆయుష్షు తగ్గుతున్నట్టు బయటపడింది. మొత్తమ్మీద పురుషులు 10 ఏళ్లు, ఆడవారు 11 ఏళ్లు జీవనకాలాన్ని కోల్పోతున్నారు. పొగ తాగే అలవాటు రకరకాల రూపాల్లో ఆయుష్షు మీద ప్రభావం చూపుతుంది. కానీ ఎంత త్వరగా మానితే అంత ఎక్కువ కాలం జీవించే అవకాశముండటం గమనార్హం. ఉదాహరణకు- రోజుకు 10 సిగరెట్లు కాల్చేవారు ఈ రోజు మానేస్తే వారం తిరిగే సరికల్లా ఒక రోజు ఆయుష్షు పెరుగుతుంది. అదే ఏడాది వరకైతే 50 రోజుల ఆయుష్షు పొడిగించుకోవచ్చు. పొగ అలవాటు ఆయుష్షును తగ్గించడమే కాకుండా మధ్య వయసులో ఆరోగ్యాన్నీ గణనీయంగా దెబ్బతీస్తుంది. ఉదాహరణకు 50 ఏళ్ల వయసువారి ఆరోగ్యం 60 ఏళ్ల వయసువారిలో మాదిరిగా ఉంటుంది. అయితే పొగ అనర్థాలు అందరిలో ఒకేలా ఉండాలనేమీ లేదు. ఈ అలవాటు గల కొందరు ఇతరులతో పోలిస్తే ఎక్కువకాలం జీవించొచ్చు, ఆరోగ్యంగానూ ఉండొచ్చు. ఇది ఎన్ని సార్లు, ఎంత గాఢంగా పొగ పీలుస్తున్నారు అనే ధోరణులు.. సిగరెట్ పొగ రకాలు, పొగలోని విషతుల్యాలు ఆయా వ్యక్తుల మీద చూపే ప్రభావం వంటి వాటి మీద ఆధారపడి ఉంటుంది




## గాజాలో 52,800 దాటిన మరణాల సంఖ్య!

ఏడాదిన్నరగా కొనసాగుతున్న యుద్ధం వల్ల గాజాలో మరణాల సంఖ్య 53 వేలకు చేరువైంది. 2023 అక్టోబర్ నుండి గాజాపై ఇజ్రాయెల్ చేస్తున్న జాతి విధ్వంస యుద్ధంలో కనీసం 52,810 మంది పాలస్తీనియన్లు మరణించారని స్ట్రిప్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. మార్చి 18న ఇజ్రాయెల్ సైన్యం గాజా స్ట్రిప్‌పై తన దాడులను తిరిగి ప్రారంభించింది. అప్పటి నుండి 2,701 మందిని చంపి 7,432 మందిని గాయపరిచింది, జనవరిలో ప్రారంభమైన కాల్పుల విరమణ ఖైదీల మార్పిడి ఒప్పందాన్ని విచ్ఛిన్నం చేసింది. గత నవంబర్‌లో, అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు, ఆయన మాజీ రక్షణ మంత్రి యోవ్ గాలంట్‌లపై గాజాలో యుద్ధ నేరాలు, మానవాళికి వ్యతిరేకంగా జరిగిన నేరాలకు అరెస్ట్ వారెంట్లు జారీ చేసింది. కాని అరెస్ట్ చేసేవారెవరు?

## సౌదీలో ప్రపంచ తొలి 'ఏఐ డాక్టర్'

కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో రోగులను పరీక్షించే క్లినిక్.. ప్రపంచంలోనే తొలిసారిగా సౌదీ అరేబియాలో ప్రారంభమైంది. చైనాకు చెందిన వైద్య పరిజ్ఞాన సంస్థ సైన్యీ ఏఐతో భాగస్వామ్యం ద్వారా అల్ మూసా హెల్త్ గ్రూప్ ప్రయోగాత్మకంగా దీన్ని అందుబాటులోకి తెచ్చింది. సౌదీలోని అల్ అహ్సా ప్రావిన్స్‌లో ఇది ఏర్పాటైంది. రోగులతో తొలుత సంభాషించి, వ్యాధి నిర్ధారణ, చికిత్స చేసే బాధ్యత నుంచి వైద్యులను తప్పించడం దీని ఉద్దేశం. ''ఈ ఏఐ క్లినిక్ వినూత్న వైద్య సేవా వ్యవస్థ. ఇందులో ఏఐ వ్యవస్థ స్వతంత్రంగా వివరాల సేకరణ నుంచి మందులు సూచించడం వరకూ పలు సేవలు అందిస్తుంది. అయితే ముందు జాగ్రత్త చర్యగా వైద్యుల పర్యవేక్షణ కొనసాగుతుంది. వారు వ్యాధి నిర్ధారణ, చికిత్స ఫలితాలను సమీక్షిస్తారు'' అని సైన్యీ సంస్థ పేర్కొంది.

# సలామ్ చేసేవారు అల్లాహ్ దృష్టిలో శ్రేష్ఠులు

- ముహమ్మద్ వహీదుద్దీన్

**'సలామ్'** అనే పదం అల్లాహ్ మహోన్నత శుభనామాలలో ఒకటి. దీనికి 'శాంతి ప్రదాత' అని అర్థం. అల్లాహ్ శాంతికి మూలం.

అల్లాహ్ తొలి మానవుడైన ఆదం(అలై)ను సృష్టించిన తరువాత అన్నింటికంటే ముందు ఆయనకు సలామ్ చేసే సంస్కారమే నేర్పాడు.

సలామ్ చేయటంలో అభిలషణీయమైన పద్ధతి ఏమిటంటే, ఎదుటి వ్యక్తి ఒక్కరైనా సరే సలామ్ చేసే వ్యక్తి బహువచనాన్ని ఉపయోగిస్తూ 'అస్సలాము అలైకుమ్ వ రహ్మతుల్లాహి వ బరకాతుహు' అని అనాలి. దానికి సమాధానంగా ఎదుటి వ్యక్తి కూడా 'వ అలైకుముస్సలామ్ వ రహ్మతుల్లాహి వ బరకాతుహు' అని చెప్పాలి.

ఒక వ్యక్తి అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స) దగ్గరికి వచ్చి "అస్సలాము అలైకుమ్" అని అన్నాడు. ఆయన అతనికి ప్రతిసలామ్ చేశారు. అతను కూర్చున్నాడు. అప్పుడాయన ఇతనికి పది పుణ్యాలు లభించాయి అని అన్నారు. మరో వ్యక్తి వచ్చి, 'అస్సలాము అలైకుమ్ వ రహ్మతుల్లాహ్' అన్నాడు. ఆయన అతనికి ప్రతి సలామ్ చేశారు. ఆ వ్యక్తి కూర్చున్నాడు. ఆయన, ఇతనికి ఇరవై పుణ్యాలు అన్నారు. కాసేపటికి ఇంకో వ్యక్తి వచ్చి "అస్సలాము అలైకుమ్ వ రహ్మతుల్లాహి వ బరకాతుహూ" అని అన్నాడు. ఆయన అతనికి ప్రతిసలామ్ చేయగా అతను కూడా కూర్చున్నాడు. అప్పుడాయన ముప్పై పుణ్యాలు అని అన్నారు.

(తిర్మిజీ, అబూ దావూద్)

అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స) ఇలా తెలిపారు: ముందుగా సలామ్ చేసేవారు అల్లాహ్ దృష్టిలో ప్రజలందరిలోకెల్లా శ్రేష్ఠులు.

(అబూదావూద్)

తన కోసం అల్లాహ్‌ను ప్రార్థించనివాడు, అందరికంటే పెద్ద మూర్ఖుడు, పనికిమాలినవాడు. అలాగే సలామ్ చేయడంలో పిసినారితనం వహించేవాడు అందరికంటే పెద్ద పిసినిగొట్టు.

(తిబ్రానీ)

దివ్య ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా ఆదేశిస్తున్నాడు : **మీకు ఎవరైనా గౌరవ భావంతో సలామ్ చేస్తే అతనికి మీరు అంతకంటే ఉత్తమమైన పద్ధతిలో ప్రతి సలామ్ చెయ్యండి. లేదా కనీసం అదేవిధంగానైనా చెయ్యండి. (అన్ నిసా- 4: 86)**

**విశ్వసించిన ప్రజలారా! మీ ఇళ్ళల్లోకి తప్ప ఇతరుల ఇళ్ళల్లోకి ప్రవేశించకండి. ఇంటి వారి అంగీకారం పొందనంతవరకు, ఇంటి వారికి సలామ్ చేయనంత వరకు. ఈ పద్ధతి మీకు ఎంతో ఉత్తమమైనది. దీనిని మీరు పాటిస్తారని ఆశించబడుతోంది.**

**(అన్ నూర్ 24: 27)**

**ఇళ్ళల్లోకి ప్రవేశించినప్పుడు, మీ వారికి సలామ్ చేయండి. ఇది మేలు కొరకు చేయబడే ప్రార్థన. అల్లాహ్ తరఫు నుండి నిర్ణయించ బడింది. ఎంతో శుభవంతమైనది, పరిశుద్ధమైనది.**

**(అన్ నూర్ - 24: 61)**

హజ్రత్ బరా బిన్ ఆజిబ్(రజి) కథనం : దైవప్రవక్త (స) మాకు ఏడు విషయాలను గురించి ఆజ్ఞాపించారు.

1) వ్యాధిగ్రస్తుణ్ణి పరామర్శించటం

2) జనాజా వెంట వెళ్ళటం

3) తుమ్మిన వ్యక్తి (అలాహమ్దులిల్లాహ్ అంటే అతని)కి సమాధానమివ్వటం.

4) బలహీనుడికి సహాయం చేయటం

5) బాధితునికి సాయపడటం

6) సలామ్‌ను సర్వసామాన్యం చేయటం.

7) ప్రమాణం చేసేవాని ప్రమాణాన్ని నెరవేర్చటం

(బుఖారీ, ముస్లిం)

**తుదిగేటు**




Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**